

www.vibharenews.com

# విభారె

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి బుధవారం 29-03-2023 సంపుటి : 04 సంచిక : 184 పేజీలు : 4 వెల : రూ 3-00

## మహిళా రిజర్వేషన్ల బిల్లు

### లోక్‌సభలో బిఆర్ఎస్ వాయిదా తీర్మానం




న్యూఢిల్లీ,మార్చి28 :మహిళా రిజర్వేషన్ల బిల్లు కోసం బీఆర్ఎస్ పార్టీ పోరాటం ఉధృతం చేసింది. ఈ బిల్లుపై చర్చను కోరుతూ లోక్‌సభలో వాయిదా తీర్మానం ప్రవేశపెట్టింది. అఖిలపక్ష సమావేశం నిర్వహించి మహిళా రిజర్వేషన్ బిల్లుపై చర్చించాలని ఎంపీలు నామా నాగేశ్వరరావు, మాలోతు కవిత ఈ తీర్మానాలు ప్రవేశపెట్టారు. మహిళా రిజర్వేషన్ బిల్లు కోసం దేశంలోని యూనివరసిటీలు, కాలేజీల్లో రౌండ్‌టేబుల్ సమావేశాలు, చర్చలు నిర్వహించేందుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కవిత ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఈ క్రమంలోనే మహిళా బిల్లుకు మద్దతు కోసం దేశంలోని ప్రముఖ విద్యావేత్తలు, ప్రొఫెసర్లు, ఆలోచనపరులు, మేధావులకు ఎమ్మెల్సీ కవిత పోస్టు కార్డులు పంపించారు.

## ఆల్ ఇండియా ఇన్విటేషన్ బాల్ బ్యాట్మింటన్ టోర్నమెంట్ ప్రారంభించిన ఎమ్మెల్యే శిల్పా...



నంద్యాల మా ప్రతినిధి (విభారె) నంద్యాల జిల్లా గోస్పాడు మండలం నాగులవరం గ్రామం లో నిర్వహిస్తున్న ఆల్ ఇండియా ఇన్విటేషన్ బాల్ బ్యాట్మింటన్ పోటీలను రిబ్బన్ కట్ చేసి పోటీలను నంద్యాల శాసనసభ్యుడు శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి ,రాష్ట్ర మార్క్ ఫెడ్ ఛైర్మెన్ పిపీ నాగి రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో , రాష్ట్ర వైయస్ ఆర్ . సోషల్ మీడియా అధ్యక్షులు పి పి మధు సుధన్ రెడ్డి మరియు గ్రామా నాయకులు పాల్గొన్నారు .పలు రాష్ట్రాల నుండి వచ్చిన క్రీడాకారులకు శుభాకాంక్షలు తెలిపిన శిల్పా! అనంతరం వారితో కలిసి బ్యాట్మింటన్ ఆడారు.


## పులివెందులలో కాల్పుల కలకలం



పులివెందుల: వైఎస్సార్ జిల్లా, సీఎం జగన్ సొంత నియోజకవర్గం పులివెందులలో తుపాకీ కాల్పుల ఘటన కలకలం రేపింది. భరత్ కుమార్ యాదవ్ అనే వ్యక్తి తన తుపాకీ తీసుకొని ఇద్దరు వ్యక్తులపై నిర్దాక్షిణ్యంగా కాల్పులకు తెగబడ్డాడు.ఈ ఘటనలో తీవ్ర గాయాలైన దిలీప్, మహబూబ్ బాషా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. భరత్ కుమార్ యాదవ్, పులివెందుల పట్టణంలోని గొర్రెల వ్యాపారి దిలీప్ మధ్య ఆర్థికలావాదేవీలు ఉన్నాయి. గత వారం రోజులుగా ఇద్దరూ డబ్బుల విషయంలో గొడవపడుతున్నట్టు సమాచారం. దిలీప్.. భరత్‌కుమార్ యాదవ్‌కు అప్పు ఉండటంతో ఆ విషయంలో ఇద్దరి మధ్య తీవ్ర వాగ్వాదం జరిగింది. పులివెందులలోని వెంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో ఈరోజు మధ్యాహ్నం ఇద్దరూ తీవ్రస్థాయిలో ఘర్షణకు దిగడంతో.. హుటాహుటిన ఇంట్లోకి దూసుకెళ్లిన భరత్‌కుమార్ యాదవ్ తనవద్ద ఉన్న తుపాకీతో కాల్పులు జరిపాడు. దిలీప్ ఛాతి, నుదిటిపై కాల్పులు జరిపినట్టు సమాచారం.ఆ సమయంలోనే అతడి పక్కనే ఉన్న దిలీప్ స్నేహితుడు మహబూబ్ బాషా అడ్డుకొనే ప్రయత్నం చేయగా.. అతడిపైనా కాల్పులు జరిపినట్టు బాధితులు చెబుతున్నారు. గాయాలతో వీరిద్దరూ ఆలయం మెట్ల వద్ద కింద పడిపోవడంతో భరత్‌కుమార్ యాదవ్ అక్కడి నుంచి తుపాకీతో పరారయ్యాడు. స్థానికులు

పోలీసులకు సమాచారం అందించడంతో బాధితులను చికిత్స నిమిత్తం పులివెందుల ఏరియా ఆస్పత్రికి తరలించారు. దిలీప్ పరిస్థితి విషమంగా ఉండటంతో కొద్ది సేపటి క్రితమే అతడిని ప్రాథమిక చికిత్స అనంతరం కడప రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. గతంలో వైఎస్ వివేకా హత్య కేసులో ఆరోపణలు ఎదుర్కొని, సీబీఐ విచారణకు హాజరైన భరత్‌కుమార్ యాదవ్‌కు అసలు తుపాకీ ఎక్కడి నుంచి వచ్చిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భరత్ కుమార్ యాదవ్ ప్రస్తుతం పరారీలో ఉన్నాడు. రంగంలోకి దిగిన పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్టు చెప్పారు.

## పేదవాడి జీవితం మారేలా మేనిఫెస్టో రూపొందించాలి: చంద్రబాబు




అమరావతి: వచ్చే సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి మేనిఫెస్టో రూపకల్పనపై తెలుగుదేశం పార్టీ కసరత్తు ప్రారంభించింది. ఎన్నికల మేనిఫెస్టో కమిటీని ఏర్పాటు చేయాలని పొలిట్ బ్యూరో సమావేశంలో కీలక నిర్ణయం తీసుకున్నారు.హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన పార్టీ పొలిట్ బ్యూరో సమావేశంలో మేనిఫెస్టో రూపకల్పనపై పార్టీనేతలతో చంద్రబాబు చర్చించారు. ప్రతి పేదవాడి జీవితం మారేలా మేనిఫెస్టో రూపొందించాలని పార్టీ నేతలకు చంద్రబాబు దిశా నిర్దేశం చేశారు. తెలుగు రాష్ట్రాల్లో సంక్షేమానికి నాంది పలికింది తెలుగుదేశం పార్టీయేనని, పేదలకు ఇప్పుడు అందుతున్న దాని కంటే రెట్టింపు సంక్షేమం అందించేలా మేనిఫెస్టో ఉండాలని సూచనలు చేశారు. మే 27, 28 తేదీల్లో రాజమహేంద్రవరం వేదికగా మహానాడు ఘనంగా నిర్వహించాలని పొలిట్ బ్యూరో నిర్ణయించిందని తెదేపా ఏపీ అధ్యక్షుడు అచ్చెన్నాయుడు తెలిపారు.

## చంద్రబాబు, అచ్చెన్నా, బాలకృష్ణకు మంత్రి రోజా సవాల్

విశాఖపట్నం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం ఎంతో పురోగతి చెందిందని మంత్రి ఆర్కే రోజా అన్నారు.సింహాచలం వరాహ లక్ష్మీనరసింహస్వామిని మంగళవారం.. మంత్రి దర్శించుకున్నారు. ఆమెకు దేవస్థానం కార్యనిర్వహణ అధికారి త్రినాథరావు స్వాగతం పలికారు. కప్పస్తంభం ఆలింగనం చేసుకొని, స్వామి వారి అంతరాలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సింహాచల దేవస్థానం కేంద్ర ప్రభుత్వ నిధులతో ఏర్పాటు చేసిన ప్రసాదం స్కీం పవర్ పాయింట్‌ను మంత్రి పరిశీలించారు.అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ, ఎమ్మెల్యేలు, మంత్రులతో సీఎం జగన్ ఓ కటుంబంలా పనిచేస్తారన్నారు. 45 ఎమ్మెల్సీ స్థానాల్లో గెలిచి బాధ్యతాయుతంగా పని చేస్తున్నామన్నారు. విశాఖ, చిత్తూరు, అనంతపురంలో పోటీ చేసి చంద్రబాబు, అచ్చెన్నా, బాలకృష్ణ గెలవాలని మంత్రి రోజా సవాల్ విసిరారు. సింహాచల దేవస్థానంలో ప్రతి భక్తునికి ఉపయోగపడే విధంగా కాటేజీలు నిర్మాణానికి పెద్దపీట వేశామన్నారు.

## రాజధాని అమరావతిపై రాష్ట్ర ప్రభుత్వ అభ్యర్థనను తిరస్కరించిన సుప్రీంకోర్టు



దిల్లీ: రాజధాని అమరావతికి సంబంధించిన కేసుల అంశంలో ఏపీ ప్రభుత్వానికిసుప్రీంకోర్టులో మరోసారి చుక్కెదురైంది.కేసు విచారణ త్వరగా చేపట్టాలని ఏపీ ప్రభుత్వ న్యాయవాదులు చేసిన విజ్ఞప్తిని జస్టిస్ కేఎం జోసెఫ్, జస్టిస్ బి.వి.నాగరత్నతో కూడిన ద్విసభ్య ధర్మాసనం తిరస్కరించింది. జులై 11న తొలి కేసుగా విచారణకు తీసుకుంటామని ధర్మాసనం స్పష్టం చేసింది. హైకోర్టు తీర్పుపై స్టే ఇవ్వాలని ఏపీ ప్రభుత్వ న్యాయవాదులు మరోసారి కోరగా.. స్టే ఇచ్చేందుకు ధర్మాసనం నిరాకరించింది. పిటిషన్ దాఖలు చేసిన వారిలో కొంత మంది రైతులు చనిపోయారని ప్రతివాదుల తరపు న్యాయవాదులు కోర్టు దృష్టికి తెచ్చారు. మరణించిన వారి తరఫున ప్రతినిధులు ప్రతివాదులుగా ఉండేందుకు అనుమతివ్వాలని న్యాయవాదులు కోరగా అందుకు అనుమతించిన ధర్మాసనం .. వారికి నోటీసులు పంపాలని ప్రభుత్వం తరపు న్యాయవాదులను ఆదేశించింది.రాజధాని అంశంపై దాఖలైన పిటిషన్‌ను వెంటనే విచారించాలన్న ఏపీ ప్రభుత్వ న్యాయవాదులపై సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జోసెఫ్ అసహనం వ్యక్తం చేశారు. ఒక కేసు విచారణ పూర్తి కాకుండా.. మరో కేసు ఎలా విచారిస్తామని ప్రశ్నించారు. నిబంధనల ప్రకారం అలా విచారించడం సాధ్యం కాదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. బాంబే మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన కేసు విచారణ జరుగుతోంది. ఈ కేసు సగంలో ఉండగా.. భోజన విరామ సమయం వచ్చింది. దాని తర్వాత తిరిగి బెంచ్ కూర్చొనేటప్పుడు వేరే అంశాలు, కేసులకు సంబంధించి మెన్షనింగ్స్ జరిగాయి. ముంబయి కేసు విచారణ తిరిగి ప్రారంభించే ముందు ఏపీ ప్రభుత్వ న్యాయవాదులు అమరావతి పిటిషన్ తీసుకోవాలని కోరగా.. జస్టిస్ కేఎం జోసెఫ్ తీవ్ర అసహనం వ్యక్తంచేశారు. కేసు విచారణ జరుగుతోంది.. ఆ కేసు విచారణ సగంలో ఉంది. అది కాదని పక్కనబెట్టి మీ కేసు ఎలా తీసుకోవాలని ప్రశ్నించారు.

## ముందస్తు బెయిల్ ఇవ్వండి.. హైకోర్టును ఆశ్రయించిన అవినాష్‌రెడ్డి



హైదరాబాద్: కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య కేసులో ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరారు.ఇప్పటికే అవినాష్ రెడ్డిని పలు సార్లు సీబీఐ ఎస్పీ రామ్‌సింగ్ నేతృత్వంలో అధికారులు విచారించిన విషయం తెలిసిందే. ఇదే కేసుకు సంబంధించి గతంలోనే అవినాష్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించగా.. అరెస్టు చేయవద్దని తాము ఆదేశాలు ఇవ్వలేమని ఆయన అభ్యర్థనను తోసిపుచ్చింది. త్వరలోనే సీబీఐ అధికారులు అవినాష్‌రెడ్డిని విచారణకు పిలిచే అవకాశముందని ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో తనను అరెస్టు చేసే అవకాశమున్నందున.. ముందస్తు బెయిల్ ఇవ్వాలని ఆయన పిటిషన్‌లో కోరినట్టు సమాచారం.వివేకా హత్యకేసులో సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. కేసును ఇంకెంత కాలం విచారిస్తారని సీబీఐపై సర్వోన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తం చేసింది. హత్యకు గల ప్రధాన కారణాలు, ఉద్దేశాలు బయటపెట్టాలని ధర్మాసనం పేర్కొంది. 'విచారణాధికారిని మార్చండి లేదా ఇంకో అధికారిని నియమించండ'ని ఘాటు వ్యాఖ్యలు చేసింది. అవసరమైతే ఇప్పుడున్న అధికారిని కొనసాగించండని పేర్కొంది. సీబీఐ దాఖలు చేసిన సీల్డ్ కవర్ నివేదిక ఆసాంతం చదివామని ధర్మాసనం పేర్కొంది. కేసు అంతా.. రాజకీయ శత్రుత్వంతో జరిగిందని రిపోర్ట్‌లో రాశారని న్యాయమూర్తి పేర్కొన్నారు. మెరిట్స్ మీద ఎలాంటి ఉత్తర్వులు ఇవ్వడం లేదని న్యాయస్థానం స్పష్టం చేసింది. సీబీఐ డైరెక్టర్ నుంచి తగిన ఆదేశాలు తీసుకోవాలని పేర్కొన్న ధర్మాసనం.. కేసు విచారణను ఈ నెల 29కి వాయిదా వేసింది. ఈక్రమంలో సీబీఐ విచారణ వేగవంతం కానుండటంతో అవినాష్‌రెడ్డి హైకోర్టును ఆశ్రయించినట్టు తెలుస్తోంది.

## కేంద్ర పన్నుల్లో రాష్ట్రాల వాటా.. ఆరేళ్లలో ఏపీకి రూ.లక్షా 88 వేల కోట్లు..

న్యూఢిల్లీ, మార్చి 28: జీఎస్టీతో సహా కేంద్ర ప్రభుత్వం వసూలు చేసిన పన్నుల మొత్తంలో ఆంధ్రప్రదేశ్ వాటా కింద గత 6 సంవత్సరాల్లో (2017 నుంచి 2023 మార్చి 10 వరకు) రూ.1,88,053.83 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి వెల్లడించారు.కేంద్ర ప్రభుత్వం నుంచి రాష్ట్రాల వాటా కింద విడుదల చేస్తున్న పన్నుల ఆదాయం గత 5 ఏళ్లుగా తగ్గుతూ వస్తోందా? అంటూ రాజ్యసభలో మంగళవారం వైఎస్సార్సీపీ సభ్యులు విజయసాయి రెడ్డి అడిగిన ప్రశ్నకు మంత్రి రాతపూర్వకంగా జవాబిస్తూ ఈ విషయం తెలిపారు.కేంద్ర వసూలు చేసిన పన్నుల్లో ఆంధ్రప్రదేశ్ వాటా కింద 2017-18లో రూ.29,001.25 కోట్లు, 2018-19లో రూ.32,787.03 కోట్లు, 2019-20లో రూ.28,242.39 కోట్లు, 2020-21లో రూ.24,460.59 కోట్లు, 2021-22 లో రూ.35,385.83 కోట్లు, 2022-23 మార్చి 10 నాటికి రూ.38,176.74 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. అలాగే దేశంలోని 29 రాష్ట్రాలకు ఆయా రాష్ట్రాల వాటా కింద గడిచిన ఆరేళ్ళలో రూ.45,11,442.86 కోట్లు విడుదల చేసినట్లు మంత్రి తెలిపారు.2017-18లో రూ.6,73,005.29 కోట్లు, 2018-19లోరూ.7,61,454.15 కోట్లు, 2019-20లో రూ.6,50,677.05 కోట్లు, 2020-21లో రూ.5,94,996.76 కోట్లు, 2021-22 లో రూ.8,82,903.79 కోట్లు, 2022-23 మార్చి 10 నాటికి రూ.9,48,405.82 కోట్లు ఆయా రాష్ట్రాల వాటా కింద విడుదల చేసినట్లు మంత్రి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం ఆమోదించిన ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం కేంద్రం పన్నుల ద్వారా వసూలు చేసిన నికర ఆదాయంలో రాష్ట్రాల వాటా కింద నెలవారీ ప్రాతిపదికన పంపిణీ జరుగుతుందని ఆయన చెప్పారు. ఈ నికర ఆదాయాన్ని రాజ్యాంగంలోని ఆర్టికల్ 279 ప్రకారం కంట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ ద్వారా నిర్ధారించి, ధృవీకరిస్తారని కూడా మంత్రి పేర్కొన్నారు.



## ఏపీలో గ్రూప్-1 మెయిన్స్ వాయిదా

విజయవాడ: ఏపీ గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష వాయిదా పడింది. ఏప్రిల్ 23 నుంచి 29 వరకు జరగాల్సిన గ్రూప్-1 మెయిన్స్‌ను జూన్ మొదటి వారానికి వాయిదా వేసింది ఏపీపీఎస్సీ.జూన్ 3 నుంచి 9 వరకు ఈ పరీక్షలు జరుగుతాయని వెల్లడించింది. 2022 సివిల్స్ ఫేజ్- 3 ఇంటర్వ్యూలు ఏప్రిల్ 24 నుంచి మే 18 వరకు ప్రకటించడంతో గ్రూప్ వన్ మెయిన్స్ వాయిదా వేయాల్సి వచ్చింది. ఈ ఇంటర్వ్యూల షెడ్యూల్‌ను యూపీఎస్సీ సోమవారమే విడుదల చేసింది.యూపీఎస్సీ సివిల్స్ ఇంటర్వ్యూలకి ఏపీ నుంచి దాదాపు 25 మంది గ్రూప్ వన్ అభ్యర్థులు హాజరవుతున్నారు.

# సంపాదకీయం

బుధవారం 29-03-2023

## మళ్లీ ఊపందుకొంటున్న ఖలిస్థాన్ ఉద్యమం

ఆరు నెలల కాలంలోనే వందలాది సిక్కులను అనుయాయులుగా మార్చుకొని, ఖలిస్థాన్ ఉద్యమానికి తిరిగి ప్రాణం పోస్తున్నట్లుగా మాటలు వల్లిస్తూ వచ్చిన అమృత్‌పాల్ సింగ్ నేడు పంజాబు పోలీసులకు సవాలుగా నిలిచాడు. ఇటీవల ఆ రాష్ట్రంలో పలు అల్లర్లకు సూత్రధారిగా నిలిచిన అమృత్ పాల్ వేటలో ఇప్పుడు పంజాబ్ సాయుధ బలగాలు నిమగ్నమై ఉన్నారు. ఆయన్ని పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారని, బూటకపు ఎన్ కౌంటర్‌లో చంపేసే అవకాశం ఉందని అమృత్ తరఫున ఒక అడ్వొకేట్ కోర్టును కూడా ఆశ్రయించాడు. ఒక్కసారిగా తెరపైకి వచ్చి రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్న ఈ 30 ఏళ్ల సిక్కు యువకుడు ఎవరు అనే ఆసక్తి దేశ వ్యాప్తంగా పెరిగిందిఅమృత్ సర్ జిల్లాలోని జల్లుపూర్‌లో జన్మించిన అమృత్ పాల్ 19 ఏటనే దుబాయ్ వెళ్లి అక్కడ తమ కుటుంబం నడిపే రవాణా వ్యాపారంలో చేరిపోయాడు. కపుర్తలాలో పాలిటెక్నిక్ చదువును మధ్యలోనే వదిలేసి దుబాయ్ వెళ్లిన ఆయన అక్కడ ఆపరేషన్స్ మేనేజర్‌గా జీవితం గడుపుతున్నాడు. అక్కడ ఆయ న గడ్డం, తలపాగా లేని సాధారణ యువకుడే. 2020లో ఢిల్లీలో జరిగిన పంజాబు రైతుల ఆందోళన పట్ల సానుభూతితో వారికి మద్దతుగా ఆ సమయంలో ఇక్కడికి వచ్చిపోయేవాడట. పంజాబీ నటుడు దీప్ సిద్ధు ఢిల్లీ రైతుల ఆందోళనకు సంపూర్ణ మద్దతు తెలిపి స్వయంగా అందులో పాల్గొన్నాడు. సిక్కు యువత పెద్ద సంఖ్యలో ఉద్యమంలో భాగస్వాములు అయ్యేలా ఆయన కృషి చేశాడు. అయితే 2021 రిపబ్లిక్ డే రోజున పెరేడ్ మైదానం వద్ద జరిగిన నిబంధనల ఉల్లంఘన, ఎర్రకోటపై సిక్కు సాంప్రదాయిక జెండాను ఎగరవేత లాంటి చర్యల్లో నిందితుడిగా ఢిల్లీ పోలీసులు దీప్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. గత నేర చరిత్ర లేనందు వల్ల రెండు నెలల జైలు జీవితం తరువాత కోర్టు ఏప్రిల్ 2021లో బెయిల్ మంజూరు చేసింది. ఆ తర్వాత దీప్ 'వారిస్ పంజాబ్ దే' అనే రాజకీయ సంస్థను స్థాపించాడు. కేంద్ర ప్రభుత్వం నుండి పంజాబ్ రాష్ట్ర హక్కుల సాధనకు, పంజాబీల ఆత్మ గౌరవ రక్షణ కోసం తన సంస్థ పని చేస్తుందని చెప్పాడు. స్వయంగా దీప్ సిద్ధు సినిమా నటుడు, గాయకుడు, సామాజిక ఉద్యమకర్త కావడంతో సిక్కు యువత ఆయనకు లక్ష్యాలకు తోడుగా నిలిచింది. అయితే అనుకోకుండా దీప్ 15 ఫిబ్రవరి 2022 నాడు రోడ్డు ప్రమాదంలో మరణించాడు. ఆయన మరణంతో సిక్కు సమాజం తీవ్ర వేదనకు గురైంది. దీప్ స్మారకంగా ఎన్నో కార్యక్రమాలు జరిగాయి. ఆయన నెలకొల్పిన వారిస్ పంజాబ్ దే పంజాబీల గుండెల్లో ఒక తీపి గురుతుగా మిగిలిపోయింది. అదే అదునుగా అమృత్‌పాల్ రంగప్రవేశం చేసి తనను వారిస్ పంజాబ్ దే నేతగా ప్రకటించుకున్నాడు.దుబాయ్‌లో ఉంటూనే ఆ సంస్థ స్థాపనలో తాను దీప్‌కు తోడుగా ఉన్నానని పత్రికల వారితో చెప్పాడు. తమ సంస్థకు అమృత్‌పాల్ సింగ్ నాయకుడు అని వారిస్ పంజాబ్ దే పేరిట 4 మార్చి 2022 నాడు ఓ వార్త వెలువడింది. జనంలో ఆ సంస్థకు ఉన్న ఆదరాభిమానాలను వాడుకొని పంజాబీలకు ఒక నాయకుడిగా ఎదగాలని అమృత్ దేశంలో అడుగుపెట్టి ఉంటాడు.దుబాయ్‌లో ఉన్నంత కాలం గడ్డం పెంచని, తలపాగా ధరించని అమృత్‌పాల్ పూర్తి సిక్కు సాంప్రదాయిక వేషధారణతో 29 సెప్టెంబర్ 2022 నాడు పంజాబ్‌కు వచ్చి, రావడంతోనే బింద్రేన్ వాలే గ్రామాన్ని సందర్శించాడు. ఆ రోజు అక్కడ వేల మంది అనుయాయుల సమక్షంలో ఆయన దస్తర్ బందీ అనే తలపాగా స్వీకరణ తంతు ఘనంగా జరిగింది. భారీ సిక్కు సమూహాల తోడుగా ఆయన సిక్కు మందిరాలను దర్శించాడు. రాజస్థాన్‌లోని శ్రీ గంగానగర్‌లో తొలిసారిగా ఆయన నేతృత్వంలో ఖల్సా పంథాలో భాగమవుతున్నట్లు వందల మందితో అమృత్ పర్చార్ అనే పవిత్ర జల స్వీకరణ కార్యక్రమం జరిగింది. వారిస్ పంజాబ్ దే తరపున నవంబర్‌లో ఖల్సా వెహిర్ అనే సభ నిర్వహించారు. అందులో ఆయన డ్రగ్స్‌కు దూరముండాలని సిక్కు యువతను ఉద్దేశించి అన్నాడు. అయితే వారిస్ పంజాబ్ దే పై అమృత్‌పాల్‌కు ఎలాంటి అధికారం లేదని, అసలు దీప్‌ను ఆయన కలువనేలేదని దీప్ కుటుంబ సభ్యులు అంటున్నారు. బింద్రేన్ వాలే తమ నాయకుడు అని, ఖలిస్థాన్ డిమాండ్‌లో తప్పేమీ లేదని అమృత్ ప్రసంగించడం వారిస్ పంజాబ్ దే లక్ష్యాలకు విరుద్ధమని వారు అంటున్నారు.అమృత్‌పాల్ సంధు యువతను వ్యసనాలకు దూరంగా ఉండాలని పైకి చెబుతూనే ఖలిస్థాన్ సెంటిమెంట్ పంజాబీల గుండెల్లో శాశ్వతంగా ఉంటుందని, దాన్ని ఎవరూ చెరిపేయలేరని వేర్పాటువాదాన్ని కూడా ప్రస్తావించేవాడు. 18వ శతాబ్దంలో ఏర్పడ్డ తమ దేశాన్ని తిరిగి అడుగుతున్నాం తప్ప ఢిల్లీ గద్దెను అడగడం లేదని అనేవాడు. అలా హద్దు మీరుతున్న ఆయన చర్యలను పంజాబ్ ప్రభుత్వం మతపర సున్నిత అంశంగా మాత్రమే చూసింది. అయితే అమృత్‌పాల్ చాప కింద నీరులా విస్తరించిన విషయం ఒకే ఒక్క సంఘటనతో బయటపడింది. ఫిబ్రవరిలో అమృత్‌పాల్ అనుచరులు తనను కిడ్నాప్ చేసి హింసించారని అజ్నాలా పోలీస్ స్టేషన్‌కు ఒక ఫిర్యాదు అందింది.పోలీసులు కదిలి ఆరుగురిని అదుపులోకి తీసికున్నారు. వారిలో లవ్ ప్రీత్ సింగ్ అనే అమృత్‌కి దగ్గరివాడు కూడా ఉన్నాడు. దాంతో ఉగ్రుడైన అమృత్ కేసు కొట్టివేయమని పోలీసులను హెచ్చరించాడు. ఆ తరువాత ఆయన అనుచరులు పోలీస్ స్టేషన్‌పై దాడి చేసి వాహనాలను ధ్వంసం చేసి పోలీసు సిబ్బందిని గాయపరిచారు. అప్పుడుగాని రాష్ట్ర పోలీసు బలగాలకు అమృత్ ఎంత శక్తిమంతుడో అర్థం కాలేదు. ఈ నెల 18న వారిస్ పంజాబ్ దే అనుచరులను అదుపులోకి తీసుకున్నారు. పోలీసు చర్యలను గమనించిన అమృత్‌పాల్ తన కాన్వాయ్‌లోని వాహనాల్లో మారుతూ పోలీసుల కళ్ళు గప్పి తప్పించుకున్నాడు. ఇప్పుడు పంజాబ్ పోలీసు వ్యవస్థ మొత్తం ఆయన వెదుకులాటలో ఉంది. అమృత్ సింగ్ కదలికలపై సరియైన నిఘా కరువైనట్లుగా అనిపిస్తుంది. పంజాబ్ విడి దేశంగా ఉండాలని కోరే ఖలిస్థాన్ ఉద్యమాన్ని తిరిగి రాజేసే చర్యలను ఆరు నెలలుగా, అదీ ఒక వ్యక్తి అమృత్‌పాల్ అనుచరులు తనను కిడ్నాప్ చేశారని ఫిర్యాదు అందే దాకా గమనించకపోవడం విడ్డూరంగా ఉంది. అసలు దుబాయ్‌లో సామాన్య జీవితం గడిపే అమృత్‌కు ఖరీదైన కార్లు ఎలా వచ్చాయి, ఆయన అనుచరుల చేతుల్లోకి ఆధునిక ఆయుధాలు ఎలా చేరాయో తెలుసుకోవలసిన బాధ్యత దేశ భద్రతా వర్గాలకు ఉంటుంది. అమృత్ సింగ్ కోసం పోలీసుల వేట, ఆయన అనుచరుల అరెస్టులకు నిరసనగా అమెరికా, బ్రిటన్ దేశాల భారత దౌత్య కార్యాలయాలపై అక్కడి సిక్కు పౌరులు దాడికి దిగడం ఎంతో ఆందోళన కలిగించే విషయం. ఖలిస్థాన్ వాదుల కన్నా అమృత్ రాక వెనుక ఖచ్చితంగా పాకిస్తాన్ హస్తం ఉందనే కోణంలో అడుగులు ముందుకు పడాలి.

# టీటీడీకి ఆర్బీఐ షాక్



తిరుపతి, మార్చి 28,తిరుమల తిరుపతి దేవస్థానానికి ఆర్బీఐ నాలుగు కోట్ల 31 లక్షల రూపాయలు ఫైన్ విధించింది. తిరుమల శ్రీవారికి వివిధ దేశాల నుంచి వచ్చిన భక్తులు కానుకలు సమర్పిస్తూ ఉంటారు. అయితే కొందరు హుండీలో నగదు రూపంలో కానుకలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటారు. ఒక్క రూపాయి నుంచి కోట్ల రూపాయలు నగదు, బంగారు, వెండి, వివిధ విదేశీ కరెన్సీ నోట్లను శ్రీవారి దర్శనంతరం హుండీలో సమర్పిస్తూ ఉంటారు భక్తులు. ఎవరు ఎంత నగదు వేశారో అనే వివరాలు ఎవరికీ తెలియదు. స్థోమతకు తగ్గట్టుగా హుండీ కానుకలు సమర్పించే సౌలభ్యం ఉండడంతో కానుకలు వేసి వెళ్లిపోతుంటారు భక్తులు. ఇక ఈ హుండీలో సైతం ఎంతో మంది అజ్ఞాత భక్తులు, విదేశీ భక్తులు నగదును ట్రాన్స్‌ఫర్ చేస్తుంటారు. వీరి వివరాలు ఏమాత్రం టీటీడీకి అసలు తెలియజేయరు. ప్రపంచ దేశాల్లో వివిధ దేశాలైన అమెరికా, ఇంగ్లండ్, అరబ్ దేశాలు, ఆస్ట్రేలియా, సింగపూర్, కెనడా, సింగపూర్, మలేషియా వంటి దేశాల నుంచి కానుకలను ఈహుండీ ద్వారా భక్తులు నగదును బదిలీ చేస్తుంటారు. ఇలా నగదును బదిలీ చేసిన వారు చాలా వరకూ వివరాలు తెలిపేందులు ఇష్టపడకుండా చాలా గోప్యంగా ఉంచుతారు. ఇలా వివరాలు తెలియజేయకుండా నగదును ఈహుండీ ద్వారా పంపడం ద్వారా టీటీడీకి సుమారు 26 కోట్ల రూపాయలు అందాయి. ఇందులో ప్రధానంగా చెప్పుకోదగినవి యూఎస్ డాలర్లు 11.50 కోట్లు, మలేషియా రింగిట్స్ రూ.5.93 కోట్లు, సింగపూర్ డాలర్లు రూ.4.06 కోట్లు ఉండగా, ఆ మొత్తాన్ని స్టేట్ బ్యాంకు టీటీడీ ఖాతాలో జమ చేయకుండా మూడు సంవత్సరాలుగా కాలం పొడిగిస్తూ వచ్చింది. అయితే ఈ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరించాలని టీటీడీ కేంద్ర ప్రభుత్వానికి లేఖ ద్వారా విన్నవించింది. అయితే కేంద్ర హోంమంత్రిత్వ శాఖ టీటీడీకి 2019లో 1.14 కోట్ల రూపాయలు అపరాధ రుసుము విధించింది. మళ్లీ ఈ ఏడాది మార్చి 5న కేంద్ర ఎఫ్.సి.ఆర్.ఎ విభాగం వార్షిక రిటర్న్‌ల్లో హుండీలో కానుకలు వేసిన వారి చిరునామాలు లేవని, టీటీడీ ఉన్నత అధికారులకు లేఖ రాస్తూ మళ్లీ రూ. 3.19 కోట్ల జరిమానా విధించింది. ఇలా రెండు సార్లు అపరాధం విధించిన మొత్తం 4.31 కోట్ల రూపాయలు. అంతే కాకుండా టీటీడీకి రాసిన లేఖలో ఏపీ దేవదాయ శాఖ తప్పులను ఎత్తు చూపుతూ టీటీడీకి లేఖను పంపింది. అయితే చాలా వరకూ ఈ హుండీ ద్వారా నగదును పంపిన భక్తుల వివరాలను టీటీడీ ఆర్బీఐకి పంపలేకపోయింది. అంశాన్ని టీటీడీ లేఖ ద్వారా కేంద్ర ప్రభుత్వానికి తెలియజేయగా, ఇదే విషయంపై న్యాయస్థానాల్లో కోసం ఫిటీషన్లు దాఖలు చేయగా, హుండీలో వేసిన కానుకలు తిరుమల తిరుపతి దేవస్థానం కార్పస్‌లో భాగమేనని ఏపీసీహెచ్ఆర్ చట్టంలోని సెక్షన్ 111 పేర్కొన్నట్లు టీటీడీ తన వాదనలను వినిపించింది. అందుకే తమ రిటర్న్ లలో విదేశాల నుంచి వచ్చిన ఈ-హుండీ కానుకలను కూడా చూపించినట్టు తెలియపరిచింది. అయితే ఎస్బీఐ టీటీడీకి చెల్లించకుండా పక్కన పెట్టిన 26 కోట్లకు వడ్డీ కూడా చెల్లించకపోవటంతో దానిపైన టీటీడీ కేంద్రానికి విన్నపాలు పంపినా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోలేదని తెలిపింది.ఈ నగదు మొత్తంపైన కేంద్రం తెలిపిన విధంగా వివరాలు సేకరించి, టీటీడీ మళ్లీ గత మార్చి26న రిటర్నులు దాఖలు చేసింది. అయితే కేంద్ర హోంమంత్రిత్వ శాఖ తాజాగా రూ. 3.19 కోట్ల జరిమానాను టీటీడీకి విధించింది. ఈ మొత్తం వ్యవహారంపై కాంగ్రెస్ నేత జయరాం రమేశ్ చేసిన ట్వీట్ ఇప్పుడు దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ధార్మిక సంస్థకు కొంత మినహాయింపు ఇవ్వాలంటూ టీటీడీ ఆర్బీఐని పలుమార్లు కోరింది. అయితే టీటీడీ విన్నపాన్ని ఆర్బీఐ తిరస్కరించింది. కేంద్ర ప్రభుత్వం విధించిన నాలుగు కోట్ల ముప్పై ఒక్క లక్షల రూపాయల అపరాధ రుసుంను టీటీడీ కేంద్ర ప్రభుత్వానికి చెల్లించింది. అయితే 2018లో ముగిసిన ఎఫ్సీఆర్ఏ లైసెన్స్ ను త్వరలోనే కేంద్ర ప్రభుత్వం రెన్యూవల్ చేయనున్నట్లు తెలుస్తోంది.

# ఇక తిరుమలలో నో పొల్యూషన్ బస్సులు

తిరుమల, మార్చి 28, తిరుమలలో సామాన్య భక్తుల కోసం 10 ఉచిత ఎలక్ట్రిక్ బస్సులను టీటీడీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా టీటీడీ ఛైర్మన్ వైవీ.సుబ్బారెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ధర్మరథాల పేరుతో సామాన్య భక్తుల సౌకర్యార్థం డీజిల్ బస్సుల స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులు తిరుమలలో భక్తులను ఉచితంగా గమ్యస్థానాలకు చేరుస్తాయని తెలిపారు. ఒక్కో బస్సు విలువ కోటి 80 లక్షల ఉంటుందని మొత్తం 18 కోట్లు విలువచేసే పది ఒలెక్ట్రా కంపెనీ బస్సులను మెగా ఇంజినీరింగ్ సంస్థ విరాళంగా అందజేసిందని వైవీ సుబ్బారెడ్డి తెలిపారు. తిరుమలలో పర్యావరణ కాలుష్యం నివారించేందుకు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం ఏడాది క్రితమే ప్రారంభించామని అన్నారు. అందులో భాగంగా అధికారులు సిబ్బందికి విధి నిర్వహణ కోసం ఎలక్ట్రిక్ కార్లను ఇచ్చామని తెలిపారు. అనంతర కాలంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ చొరవతో 65 ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ ప్రతిరోజు తిరుపతి నుంచి తిరుమల మధ్య నడుపుతోం దని అన్నారు. తాజాగా పది ఎలక్ట్రిక్ బస్సుల కూడా ప్రారంభించడం సంతోషంగా ఉందని అన్నారు. ఇప్పటికే తిరుమలలో ప్లాస్టిక్ వినియోగం తగ్గించేందుకు చర్యలు చేపట్టామని అన్నారు. లడ్డు కౌంటర్లలో ప్లాస్టిక్ రహిత కవర్లతో పాటు తిరుమలలో ప్లాస్టిక్ వాటర్ బాటిల్లను పూర్తిస్థాయిలో నిషేధించామని తెలిపారు.రాబోయే రోజుల్లో తిరుమలలో పర్యావరణం కాపాడేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. "భక్తుల కోసం ఉచిత బస్సులను టీటీడీ నడుపుతుంది. తిరుమల కొండపై పర్యావరణ కాపాడేలా పది ఎలక్ట్రిక్ బస్సులు మెగా సంస్థ టీటీడీకి అందించింది. వారంలో రోజుల్లో ఈ బస్సులు తిరుమలలో అందుబాటులోకి రానున్నాయి. తిరుమలలో ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ వల్ల గదుల కేటాయింపు పారదర్శంగా జరుగుతుంది. వేసవిలో భక్తులకు ఇబ్బందులు లేకుండా విస్తృత ఏర్పాట్లు చేస్తున్నాం. మాడ వీధుల్లో చల్లటి పాయింటింగ్, చలువపందిళ్లు, తాగునీరు ఏర్పాటు చేస్తున్నాం. వేసవిలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేస్తాం. ఎఫ్.సి.అర్.ఏ నిభంధనలకు విరుద్ధంగా విదేశాల నుంచి విరాళాలు స్వీకరించినందుకు టీటీడీ ఆర్బీఐ 3 కోట్ల జరిమానా వేసింది. ఆర్బీఐ వేసినా జరిమానాను త్వరలో కట్టేస్తాం. త్వరలో విదేశాల నుంచి వచ్చే ఎఫ్.సి.ఆర్.ఏ లైసెన్స్ ద్వారా విరాళాలు తిరిగి తీసుకుంటాం. టీటీడీకి ఉన్న ఎఫ్.సి.ఆర్.ఏ లైసెన్స్ కాలపరిమితి ముగియడంతో రెన్యూవల్ చేయమని ఆర్బీఐను కోరాం. హుండీలో కానుకల ద్వారా టీటీడీ ఖజనాలో రూ.30 కోట్లు విదేశీ కరెన్సీ ఉంది."-వైవీ.సుబ్బారెడ్డి మేఘా ఇంజినీరింగ్ ఉ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్(ఎంఈఐఎల్) తిరుమలను సందర్శించే భక్తుల సౌకర్యార్థం తిరుమల తిరుపతి దేవస్థానానికి ఉచితంగా పది ఎలక్ట్రిక్ బస్సుల అందించింది. ఎంఈఐఎల్ గ్రూప్ అనుబంధ కంపెనీ ఒలెక్ట్రా గ్రీన్ టెక్? లిమిటెడ్ ఈ బస్సులను హైదరాబాద్ సమీపంలోని తన ప్లాంట్ లో తయారు చేసింది. టీటీడీ మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించిన తొలి బస్సును ఇటీవల దేవస్థానం రవాణా విభాగం జనరల్ మేనేజర్ పీవీ శేషారెడ్డి సమగ్రంగా పరిశీలించారు. ఒలెక్ట్రా తయారు చేసిన అత్యాధునిక సౌకర్యాలు కలిగిన 10 ఎలక్ట్రిక్ బస్సులను తిరుమల తిరుపతి దేవస్థానానికి అందించాలని ఎంఈఐఎల్ నిర్ణయించిన విషయం తెలిసిందే. వేంకటేశ్వర స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు పరిశుభ్రమైన, వాయు, శబ్ద కాలుష్యంలేని ప్రయాణాన్ని ఈ విద్యుత్ బస్సుల అందించాలేని ఈ బస్సులు అందించినట్లు ఒలెక్ట్రా ప్రతినిధులు తెలిపారు. ఒలెక్ట్రా అందిస్తున్న ఎలక్ట్రిక్ బస్సులు తిరుమలను పర్యావరణ హితంగా మార్చుతాయన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

# నెల్లూరు వైసీపీలో పడనున్న మరొక వికెట్

నెల్లూరు, మార్చి 28, నెల్లూరు జిల్లాలో ఇప్పటికే ముగ్గురు ఎమ్మెల్యేలపై వైసీపీ వేటు వేసింది. మంత్రి పదవులు రాని ఒకరిద్దరు ఇంకా అసంతృప్తితో ఉన్నారనే ప్రచారం జరుగుతోంది. అయితే వారెవరూ పార్టీ లైన్ దాటలేదు, ఎక్కడా పల్లెత్తు విమర్శ కూడా చేయలేదు. పైగా అవకాశం వస్తే మాజీ సీఎం, టీడీపీ అధినేత చంద్రబాబుకి చాకిరేవు పెట్టడానికి బాగా ఉత్సాహం చూపిస్తారు. అలాంటి ఎమ్మెల్యేలపై కూడా ఇప్పుడు వాట్సాప్ లో ప్రచారం హోరెత్తిపోతోంది. తాజాగా కోవూరు ఎమ్మెల్యే ప్రసన్న కుమార్ రెడ్డి వైసీపీ అధిష్టానంపై అసంతృప్తితో ఉన్నారంటూ నెల్లూరు వాట్సప్ గ్రూపుల్లో ఓ మెసేజ్ తెగ వైరల్ అవుతోంది. నెల్లూరు రాజకీయాల్లో ఇది హాట్ టాపిక్ గా మారింది.

ప్రసన్నకుమార్ రెడ్డి.. 2012 నిండి జగన్ కు అండగా నిలిచిన సీనియర్ నాయకుడు

2019 తర్వాత తనకు ఖచ్చితంగా మంత్రి పదవి వస్తుంది అని ఆశించిన ప్రసన్నకుమార్ రెడ్డి

మంత్రి పదవి అటుంచితే .. తనకు రావాల్సిన పెండింగ్ బిల్లులు కూడా రావట్లేదు అని అనుచరుల దగ్గర వాపోయిన ప్రసన్నకుమార్ రెడ్డి. పార్టీలో కనీస గౌరవం లేదు అని అసంతృప్తి

పార్టీ మారడం తప్ప తనకు వేరే మార్గం లేదని అనుచరులకు స్పష్టం చేసిన ప్రసన్నకుమార్ రెడ్డి

టీడీపీ బీజేపీలలో ఒక పార్టీలో చేరే అవకాశం ఉందని తెలిపిన ప్రసన్నకుమార్ రెడ్డి

ఈ విషయంపై మరికొద్ది రోజుల్లో మరికొంత స్పష్టత వచ్చే అవకాశం.."

ఇదీ ఆ మెసేజ్ సారాంశం. ఎవరో పొలిటికల్ అనలిస్ట్ వార్త రాశారా అనేలా కనిపిస్తున్న ఈ న్యూస్ ను ఫార్వార్డ్ చేసినట్టుగానే ఒక ఫేక్ వార్త సృష్టించారనిపిస్తోంది. సీఎం జగన్ పై అసంతృప్తితో రగిలిపోతున్నారని, ఆయన పార్టీ మారతారని అంటున్నారు. ఇందులో టచ్ చేసిన పాయింట్ కూడా మరీ అంత తీసిపారేసేలా లేదు. మంత్రి పదవి రాలేదనే ఉద్దేశంతో ప్రసన్న పార్టీ మారతారంటున్నారు. పార్టీ స్థాపించినప్పటి నుంచి జగన్ తోనే ఉన్న అతికొద్దిమంది నేతల్లో ప్రసన్న కూడా ఒకరు. సీనియర్ నేత, రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం. అలాంటి నల్లపురెడ్డి ప్రసన్నకు సీఎం జగన్ మంత్రి పదవి ఇవ్వకుండా పక్కనపెట్టారు. దీంతో సహజంగానే ఆయనలో అసంతృప్తి ఉంటుంది. కానీ ఆయనెప్పుడూ బయటపడలేదు. ఇటీవల నెల్లూరు బ్యారేజ్ కి నల్లపురెడ్డి శ్రీనివాసులరెడ్డి పేరుని ఖరారు చేశారు సీఎం జగన్. ఆ పేరుతో ప్రసన్నను కాస్త కూల్ చేయాలనుకున్నారు. ఆమధ్య గడప గడప కార్యక్రమంలో కూడా హుషారుగా లేరంటూ చురకలంటించారు. ఆ తర్వాత ప్రసన్న గడప గడపలో స్పీడ్ పెంచారు. జగన్ ఇచ్చిన టార్గెట్ ని రీచ్ అవుతున్నారు. ఐప్యాక్ దృష్టిలో పడేందుకు ప్రచారాన్ని కూడా ముమ్మరం చేశారు. ప్రస్తుతానికి ఆయనెక్కడా జగన్ కి వ్యతిరేకంగా నోరు మెదపలేదు. ఇటీవల నలుగురు ఎమ్మెల్యేలపై పార్టీ సస్పెన్షన్ వేటు వేసిన తర్వాత కూడా ప్రసన్న కుమార్ రెడ్డి అధిష్టానానికి సపోర్ట్ గా మాట్లాడారు. చంద్రబాబుపై ధ్వజమెత్తారు. ఆ నలుగురిపై విరుచుకుపడ్డారు. అలాంటి ప్రసన్న సడన్ గా పార్టీకి దూరం ఎందుకు జరుగుతారు. చంద్రబాబుని జీవితంలో ఎవరూ తిట్టనన్ని తిట్లు తిట్టాడు కాబట్టి, ఆయన టీడీపీలో చేరే అవకాశమే లేదు. అలాగని బీజేపీలో చేరి రాజకీయ జీవితాన్ని నాశనం చేసుకునేంత అమాయకుడు కూడా కాదు. పోనీ ప్రసన్నకు కోవూరు టికెట్ ఇవ్వనని జగన్ చెప్పారా అంటే అలాంటి ప్రచారం కూడా లేదు. మరి అసలు నిప్పే లేకుండా ఈ పొగ ఎలా వస్తోంది. ఈ పొగ ఎవరు పెట్టారనేది తేలాల్సి ఉంది.

# పీపీపీ విధానంలో ఇండస్ట్రియల్ పార్కులు

విశాఖ ఏపీ పారిశ్రామికాభివృద్ధిలో నూతన విప్లవానికి తెరతీస్తూ.. ఆంధ్రప్రదేశ్ సరికొత్త పారిశ్రామిక విధానాన్ని ప్రకటించింది. 2023-27 సంవత్సరాలకు రూపొందించిన ఈ పాలసీని పారిశ్రామికవేత్తల సమక్షంలో ఆవిష్కరించింది. పాత పాలసీ గడువు ముగియక ముందే కొత్త పాలసీని ప్రకటించడం ఇదే తొలిసారి. సోమవారం విశాఖలో పారిశ్రామికవేత్తలతో కూడిన సమావేశంలో రాష్ట్ర పరిశ్రమల, ఐటీ శాఖలు మంత్రి గుడివాడ అమర్‌నాథ్ నూతన పారిశ్రామిక విధానాన్ని ఆవిష్కరించారు.రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి దోహదం చేసేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా నిర్మాణాత్మక ఇండస్ట్రియల్ పాలసీని ప్రభుత్వం రూపొందించింది అన్నారు అమర్‌నాథ్. నూతన విధానం పారిశ్రామికాభివృద్ధిలో విప్లవాన్ని సృష్టిస్తుందని పారిశ్రామికవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈనెల 31వ తేదీతో పాత విధానం ముగియనుండడంతో ఏప్రిల్ 1వ తేదీ నుంచి పారిశ్రామిక విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ సలహాదారు శ్రీధర్, ఆ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వకరికాల వలవన్, జేడీ రామలింగరాజు, డైరెక్టర్ డా.జి సృజన, ఏపీఐడీసీ ఛైర్ పర్సన్ బండి పుణ్యశీల, సీఐఐ ఏపీ చాప్టర్ వైస్ ఛైర్మన్ డా.మురళీ కృష్ణ, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు. ఫ్లగ్ అండే ప్లే విధానానికి అనుగుణంగా పాలసీ రూపొందించారు.

## వడివడిగా రైల్వే విద్యుదీకరణ పనులు

కర్నూలు, మార్చి 28, రైల్వే విద్యుదీకరణ పనులపై రైల్వే శాఖ అధికారులు ప్రత్యేక చొరవ చూపిస్తున్నారు. దీంతో ఏడాది చివర్లో గద్వాల్ - కర్నూలు సిటీ మధ్య విద్యుదీకరణ పనులను రైల్వే శాఖ పూర్తి చేసింది.దక్షిణమధ్య రైల్వే 2022-2023 ఆర్థిక సంవత్సరం చివరి అంకంలో విద్యుదీకరణకు అధిక ప్రాధాన్యమిస్తూ పనులను వేగవంతం చేసింది. దీంతో దక్షిణ మధ్య రైల్వే పరిధిలో మరిన్ని విభాగాలను విద్యుదీకరించిన మార్గాల జాబితాలో చేర్చింది. ఈ క్రమంలో దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని గద్వాల్ - కర్నూలు సిటీ మధ్య 54 రూట్ కిమీ దూరం వరకు విద్యుదీకరణ పనులను పూర్తి చేసింది. జోన్ పరిధిలో సికింద్రాబాద్ - ధర్మవరం మధ్య పూర్తిస్థాయిలో విద్యుదీకరించిన రైలు మార్గంలో ఇప్పుడు విద్యుత్ ట్రాక్షన్ ద్వారా రైళ్లను నడిపే వీలు కలిగిందని రైల్వే శాఖ ప్రకటించింది.విద్యుదీకరణ ప్రాజెక్ట్ లో స్టేషన్లు...గద్వాల్ - కర్నూలు సిటీ స్టేషన్ల మధ్య విద్యుదీకరణ, డోన్ - కర్నూలు సిటీ - మహబూబ్‌నగర్.. సికింద్రాబాద్ - ముద్ఖేడ్ - మన్మాడ్ విద్యుదీకరణ ప్రాజెక్ట్ లో భాగంగా పూర్తి చేశారు. ఈ ప్రాజెక్ట్ 2018 -19 సంవత్సరంలో రూ. 916.07 కోట్ల సవరించిన అంచనా వ్యయంతో పనులు చేపట్టడం జరిగిందని రైల్వే అధికారులు వెల్లడించారు. సికింద్రాబాద్ - మహబూబ్‌నగర్ మధ్య విభాగాన్ని వేరే ప్రాజెక్టులో భాగంగా మంజూరు చేయటం ద్వారా ఇప్పటికే విద్యుదీకరించామని ప్రకటించారు. ఈ ప్రాజెక్టు కింద మహబూబ్‌నగర్ - గద్వాల్ ఉ కర్నూలు సిటీ -డోన్ ల విభాగాల మధ్య పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. దక్షిణ మధ్య రైల్వే పరిధి లోని డోన్ - గుత్తి - ధర్మవరం మరియు నైరుతి రైల్వే పరిధిలోని ధర్మవరం - బెంగళూరు సిటీ విభాగాల మధ్య విద్యుదీకరణ కూడా పూర్తయింది. అందువల్ల, ప్యాసింజర్ రైళ్లు, గూడ్స్ రైళ్లు రెండూ, ఇప్పుడు హైదరాబాద్ - ధర్మవరం తో పాటుగా, బెంగుళూరు వరకు సజావుగా ప్రయాణించేందుకు వీలుంటుందని రైల్వే అధికారులు భావిస్తున్నారు. రైలు ప్రారంభమయిన స్టేషన్ నుంచి చివరి స్టేషన్ వరకు రైళ్లను ఎలక్ట్రిక్ ట్రాక్షన్‌త నడిపేందుకు వీలుపడుతుందని అంటున్నారు.ఎలక్ట్రిక్ ట్రాక్షన్‌తో రైళ్ల రాకపోకల నిర్వహణ వల్ల కార్బన్ వినియోగం తగ్గుతుందని, దీని వలన పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని రైల్వే అధికారులు అంటున్నారు. ఇంజిన్ మార్పిడిని నివారించడం ద్వారా రైళ్ల నిర్వహణలో రైలు ప్రయాణీకులకు ఎలాంటి అంతరాయం లేని రాకపోకలు సాగించేందుకు సహాయపడుతుందని చెబుతున్నారు. ప్రయాణికులు, సరకు రవాణా చేసే రైళ్ల మార్గ మధ్య నిలుపుదలను తగ్గిస్తుందని, రైళ్ల సగటు వేగాన్ని కూడా మెరుగుపరచేందుకు వీలుంటుందని తెలిపారు. విభాగాల మధ్య సామర్థ్యం పెంపుదల కారణంగా ఈ విభాగంలో మరిన్ని రైళ్లను ప్రవేశపెట్టే అవకాశం ఉందని వెల్లడించారు. విద్యుదీకరణ వల్ల రైల్వేలకు ఇంధన ఖర్చులు పెద్ద ఎత్తున ఆదా అవుతుందని, దీంతో పాటుగా కార్యాచరణ సామర్థ్యాన్ని పెంపొందించడానికి సహాయపడతాయని తెలిపారు.దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అరుణ్ కుమార్ జైన్ మాట్లాడుతూ.. విద్యుద్దీకరణ పనులను పూర్తి చేయడంలో అద్భుతమైన పని తీరును కనబరిచటంతో పాటుగా, అంకితభావంతో పనిచేసినందుకు ఎలక్ట్రికల్ విభాగం, అధికారులు, సిబ్బందిని అభినందించారు. గద్వాల్- కర్నూల్ స్టేషన్ల మధ్య ఈ మార్గంలో విద్యుదీకరణ పూర్తవడంతో, సికింద్రాబాద్ - బెంగళూరు మధ్య మొత్తం సెక్షన్‌లో ఎలక్ట్రిక్ రైళ్లను ప్రవేశపెట్టాలని యోచిస్తున్నట్లు జనరల్ మేనేజర్ తెలిపారు. జోన్ పరిధిలో ఇప్పటికే ఉన్న బ్రాడ్ గేజ్ మార్గాలను 100% విద్యుదీకరణ దిశగా వడివడిగా అడుగులు వేస్తోందని కూడా ఆయన పేర్కొన్నారు.

## నూతన సచివాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శిల్పా రవి రెడ్డి...

నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు రైతు నగరం నందు కౌన్సిలర్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 35 లక్షల రూపాయలతో నూతన గ్రామ సచివాలయాన్ని నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఈషాక్ బాషా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ పి పి నాగిరెడ్డి, నంద్యాల మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్ , వైయస్ఆర్సిపి నాయకులు రామసుబ్బారెడ్డి మరియు రైతు నగరం వైసిపి నాయకులు పాల్గొన్నారు...ఈ సందర్భంగా నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ వార్డు సచివాలయాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించడానికి మంచి అవకాశం ఉందన్నారు అలాగే కొన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా సచివాలయాలు నిలిచాయని గాంధీజీ కలలు కన్నా స్వరాజ్యాన్ని ప్రజలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నంద్యాల నియోజకవర్గ ప్రజల తరఫున రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్నకు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నానుఅన్నారు

## జబర్దస్త్ మేడం..

**వైసీపీకి ఎన్నెన్ని ఓట్లు వచ్చాయో చూస్కో**

**టీడీపీ అనిత ధ్వజం**

విశాఖపట్నంరాష్ట్ర మంత్రులపై టీడీపీ రాష్ట్ర తెలు గు మహిళా అధ్య క్షురాలు వంగల పూడి అనిత తీవ్రస్థాయిలో విరుచు కుపడ్డారు.ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ విజయానికి సంబం ధించి వైసీపీ నేతలు చేస్తున్న వ్యా ఖ్యలపై అనిత మాట్లాడుతూ ఉండవల్లి శ్రీదేవి.. ఊసర వెల్లి శ్రీదేవి అని జోకర్ మంత్రి అంటున్నారని అన్నారు. ఇటీవ ల జరిగిన పట్టభద్రుల ఎన్నికల్లో పులి వెందుల నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీకి ఎన్నెన్ని ఓట్లు వచ్చా యో చూస్కో అని అన్నారు. నలుగురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేసిన వైసీపీ... రఘురామరాజును ఎందుకు సస్పెండ్ చెయ్యలేదని ప్రశ్నించారు. తమరు చేసిన పనుల వలన ప్రజావ్యతిరేకత వచ్చిందని అనిత పేర్కొ న్నారు. రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్, గంజాయి ఆంధ్ర ప్రదేశ్గా తీర్చిదిద్దడానికి సీఎం జగన్ ఒక్క ఛాన్స్ అడిగారా? అని ప్రశ్నించారు.

# కన్నా, రాయపాటి... ఒక్కటవుతున్నారా



గుంటూరు, మార్చి 28,గుంటూరు తెలుగు దేశం పార్టీ రాజకీయాలు చాలా హాట్‌గా మారాయి. ఎట్టి పరిస్దితుల్లోనూ గెలుపే లక్ష్యంగా పని చేయాలనే టార్గెట్‌తో ఇరు పార్టీలకు చెందిన నాయకులు దీక్ష తీసుకున్నట్టు కనిపిస్తోంది. దీంతో దశాబ్దాలుగా ఉన్న విభేదాలను సైతం పక్కన పెట్టి అందరిని కలుపుకొని వెళ్ళేందుకు అవసరమైన అన్ని మార్గాలను సద్వినియోగం చేసుకుంటున్నారు. ఇటీవల తెలుగు దేశం పార్టీలో చేరి కన్నా లక్ష్మీనారాయణ, ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన నాయకులను కలుపుకునే క్రమంలో ప్రత్యేక విందు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి గుంటూరు జిల్లాకు చెందిన తెలుగు దేశం పార్టీ సీనియర్ నాయకులు హజరయ్యారు.ఇదే సమావేశానికి మాజీ పార్లమెంట్ సభ్యుడు రాయపాటి సాంబశివరావు తనయుడు రాయపాటి శ్రీనివాస్ కూడా రావడం అందర్నీ ఆకట్టుకుంది. ఎప్పటి నుంచో ఈ రెండు కుటుంబాల మధ్య విభేదాలు ఉన్నాయి. కన్నాపై రాయపాటి సాంబశివరావు పరువు నష్టం కేసు కూడా వేశారు. అయితే కోర్టులో ఇరువురు నేతలు రాజీపడ్డారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇరువురు నేతలు పోటాపోటీగా రాజకీయాలు నడిపించారు. ఆ క్రమంలో ఇరువురి గ్రూపులు కూడా ఉన్నాయి. రాజకీయంగా ఘర్షణలకు కూడా జరిగాయి. ఒకరిపై ఒకరు కేసులు బనాయించుకోవటం, ఆందోళనలు చేయటం వంటి ఘటనలు గుంటూరు రాజకీయాల్లో షరామామూలుగా సాగుతూ వచ్చాయి. వీళ్లిద్దరూ కాంగ్రెస్ పార్టీలో ఉండేవాళ్లు. విభేదాలు కూడా అదే స్థాయిలో ఉండేవి. తర్వాత మారిన రాజకీయ పరిస్థితులు కారణంగా ఇద్దరూ కాంగ్రెస్ పార్టీని వీడారు. రాయపాటి టీడీపీలో చేరితే... కన్నా లక్ష్మీనారాయణ బీజేపీలో చేరారు. అక్కడ నుంచి తెలుగు దేశం పార్టీ కండువా కప్పుకోవటం జరిగింది. దీంతో ఇప్పుడు మరోసారి ఒకే పార్టీలోకి వచ్చిన కన్నా, రాయపాటి కుటుంబాల మధ్య సంబంధాలు ఎలా ఉంటాయనే ఉత్కంఠ నడిచింది. ఒకే పార్టీలో ఉ ంటూ తరచూ తిటుకునే వాళ్లు ఇప్పుడు టీడీపీలో ఎలా ఉంటారనే చర్చ కూడా సాగింది. అనూహ్యంగా రెండు వర్గాలు కలిసి విందు భేటీలో పాల్గొనడం గంటూరు రాజకీయాల్లో ఇదో ట్విస్ట్ అంటున్నారు స్థానికులు. ఇద్దరూ కలసి రాజకీయం చేయాలని నిర్ణయించారట కూడా. అందులో భాగంగానే కన్నా లక్ష్మినారాయణ నిర్వహించిన సమావేశానికి రాయపాటి శ్రీనివాస్ హజరయ్యారు. శ్రీనివాస్ గతంలో గుంటూరు మేయర్‌గా ఎమ్మెల్సీగా కూడా పని చేశారు.ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు కీలకంగా ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో ఎట్టి పరిస్థితుల్లో అధికారం దక్కించుకోవటమే ధ్యేయంగా తెలుగు దేశం విశ్వ ప్రయత్నాలు చేస్తోంది. అందులో భాగంగానే కన్నా లక్ష్మి నారాయణ వంటి కీలక నేతలను పార్టీలోకి ఆహ్వానించారు. ఆ తరువాత నుంచి పార్టీలో కార్యకలాపాలు కూడా దూకుడు పెంచింది. పార్టీలోని నాయకులను యాక్టివ్ చేయటం,కార్యకర్తలను కలుపుకొని ముందుకు వెళ్ళటం వంటి వ్యూహాత్మకమైన ఎత్తుగడలు వేస్తోంది. అందులో భాగంగానే సీనియర్ నేత అయిన కన్నా లక్ష్మినారాయణకు చంద్రబాబు ఆ బాధ్యతలను అప్పగించారనే ప్రచారం జరుగుతుంది. చంద్రబాబు ఇచ్చిన పవర్‌తో కన్నా ఫుల్ టైం పాలిటిక్స్‌ను గుంటూరు కేంద్రంగా నిర్వర్తిస్తున్నారు. ముందు గుంటూరు జిల్లాలో తెలుగు దేశం పార్టీకి చెందిన క్యాడర్ నాయకులతో సమావేశాలు నిర్వహించారు. అనంతరం కన్నా రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న అన్ని జిల్లాల్లో కూడా కార్యకలాపాలపై ఆరా తీస్తున్నారు. పొలిటికల్‌గా అన్ని జిల్లాల్లో కూడా కన్నాకు ఫాలోయింగ్ ఉన్నందున వాటిని తెలుగు దేశానికి అవసరమైన రీతిలో ఉపయోగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని టాక్. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 17 అసెంబ్లి నియోజకవర్గాలు, మూడు పార్లమెంట్ స్థానాలను దక్కించుకోవటమే ప్రధాన లక్ష్యంగా తెలుగు దేశం నేలు అన్ని ప్రయత్నాలు చేస్తున్నారని,అందులో కన్నా లక్ష్మినారాయణ కీలకంగా వ్యవహరిస్తారని అంటున్నారు. ఈ వ్యూహంలో భాగంగానే వైరి వర్గాన్ని కూడా కలుపుకొని వెళ్లేందుకు వెనుకాడటం లేదన్నది పార్టీ వర్గాలు చెబుతున్నా మాట.

## ఆత్మకూరు నుంచే ఆనం..?

నెల్లూరు, మార్చి 28,ఆనం రామనారాయణరెడ్డి పార్టీ నుంచి సస్పెండ్ అయ్యారు. ఇక ఆయన తెలుగుదేశం పార్టీలో చేరడం దాదాపు ఖాయమయింది. మరోసారి ఆయన పసుపు కండువా కప్పుకునేందుకు సిద్ధమయ్యారు. 2014లో రాష్ట్ర విభజన తర్వాత టీడీపీలో చేరిన ఆనం పార్టీ అధినాయకత్వంపై అసంతృప్తితో వైసీపీలో చేరి వెంకటగిరి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. కానీ అక్కడ మంత్రి పదవి దక్కలేదు.మరోసారి పోటీ చేసి నెగ్గి నెల్లూరు రాజకీయాల్లో ఆనం కుటుంబం ట్రాక్ రికార్డును మళ్లీ లైన్ లోకి తేవాలనుకుంటున్నారు. ఆయనకు అచ్చి వచ్చిన నియోజకవర్గం ఆత్మకూరు. అక్కడ అయితే సునాయాసంగా విజయం సాధిస్తానన్న ధీమాను ఆనం తన సన్నిహితుల వద్ద వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. అందుకే ఆనం రామనారాయణరెడ్డి వెంకటగిరి నుంచి ఆత్మకూరుకు ఈసారి మారిపోక తప్పదు. వెంకటగిరిలో పోటీ చేసి టెన్షన్ పడే కన్నా తనకు పట్టున్న నియోజకవర్గం ఆత్మకూరు అయితేనే బెటర్ అని ఆనం భావిస్తున్నారని తెలిసింది.ఇప్పటికే తెలుగుదేశం పార్టీ అగ్రనేతతో టచ్ లోకి వెళ్లిన ఆనం రామనారాయణరెడ్డి త్వరలోనే ఆ పార్టీలో చేరనున్నారు. అంతకు ముందుగానే ఆత్మకూరు టిక్కెట్ ను కన్ఫర్మ్ చేసుకున్నారన్న టాక్ కూడా సింహపురిలో వినిపిస్తుంది. ఆత్మకూరు అయితేనే తాను మేకపాటి కుటుంబాన్ని ఎదుర్కొనగలనని కూడా ఆనం చెప్పినట్లు తెలిసింది. నెల్లూరు టీడీపీలో మరొక నియోజకవర్గం కూడా వేకెంట్ గా లేకపోవడం ఆనంకు కలసి వచ్చే అంశంగా చెబుతున్నారు. ఆత్మకూరు ఇప్పటికే ఉన్న తన పరిచయాలు, క్యాడర్ ను కూడా ఆనం రెడీ చేసినట్లు చెబుతున్నారు. 2009లో ఆత్మకూరు నియోజకవర్గం నుంచి ఆనం రామనారాయణరెడ్డి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలిచారు. మంత్రిగా ఆ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారు కూడా. తనకు వ్యక్తిగత ఓటు బ్యాంకు కూడా ఉందని ఆనం విశ్వసిస్తున్నారు. టీడీపీకి కూడా సరైన అభ్యర్థి లేరు. ప్రతి ఎన్నికకు అభ్యర్థులను మార్చి మార్చి పోటీ చేయిస్తుండటం కూడా ఆ పార్టీకి కలసి రావడం లేదు. అయితే టీడీపీకి చెందిన బలమైన సామాజికవర్గం కూడా ఆత్మకూరు నియోజకవర్గంలో ఎక్కువగా ఉంది. అయినా ఆత్మకూరులో ఒకే ఒక్కసారి టీడీపీ గెలిచింది. 1994లో టీడీపీ నుంచి కొమ్మి లక్ష్మయ్య నాయుడు విజయం సాధించారు. ఆ తర్వాత ఇక్కడ గెలుపు అనేదే లేదు. అందుకే 2019 ఎన్నికల్లో బొల్లినేని కృష్ణయ్యను నిలబెట్టారు. 2014లో మురళి కన్నబాబును పోటీకి దింపారు. ఇలా మారుస్తుండటంతో టీడీపీకి సరైన అభ్యర్థి లేరు. అక్కడ అయితే ఆనం రామనారాయణరెడ్డి తనకు తిరుగుండదని భావిస్తున్నారు పైగా రెండు, మూడు సార్లు మినహాయించి రెడ్డి సామాజికవర్గం నేతలే విజయం సాధించారు. తనపై సస్పెన్షన్ వేయడం సానుభూతిగా మారి తనకు కలసి వస్తుందని భావిస్తున్నారు. మేకపాటి గౌతమ్ రెడ్డి మరణం తర్వాత అక్కడ వైసీపీ బలహీనపడిందన్న అంచనాలో ఉన్నారు. జగన్ మరోసారి మేకపాటి కుటుంబానికే అక్కడ టిక్కెట్ ఇస్తారని, తాను పోటీ చేస్తా ఈసారి కూడా అసెంబ్లీలోకి అడుగుపెట్టడం ఖాయమని, తన పాత నియోజకవర్గాన్ని తన సొంతం చేసుకోవచ్చని ఆనం భావిస్తున్నారట. అందుకోసమే అక్కడి నేతలతో తరచూ సమావేశమవుతున్నారని చెబుతున్నారు. ఆనం అక్కడి నుంచి పోటీ చేస్తే పార్టీకి కూడా టిక్కెట్ల పరంగా ఎలాంటి ఇబ్బందులు ఉండవని అంటున్నారు. మొత్తం మీద వెంకటగిరిలోమాత్రం ఈసారి ఆనం రామనారాయణరెడ్డి పోటీ చేసే అవకాశమే లేదు. ఆత్మకూరుకు షిఫ్ట్ అవ్వడం ఖాయమన్నది ఆయన సన్నిహితుల నుంచి వినిపిస్తున్న టాక్

## మల్యాల గ్రామంలో శ్రీరామ నవమి సందర్భంగా వివిధ పోటీలు

నందికొట్కూరు నందికొట్కూరు మండలం మల్యాల గ్రామము నందు శ్రీరామ నవమి సందర్భంగా పోటీలు నిర్వహించబడును మల్యాల గ్రామంలో వివిధ రకాల పోటీలను నిర్వహిస్తున్నట్లు మల్యాల దేవాదాయ శాఖ ధర్మకర్త గోవిందా చారి సర్పంచు ఉమాదేవి సోమవారం తెలిపారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. మల్యాల గ్రామంలో ప్రసిద్ధిగాంచిన స్వస్తిశ్రీ శోభకృతు నామ సంవత్సర చైత్రమాస శుద్ధ నవమీ గురువారము అనగా తేది. 30 ఉ దయం 11 గంటలకు మల్యాల గ్రామములో వెలసిన సీతారామాంజనేయ స్వామి దేవాలయము నందు శ్రీ సీతారాముల వారి కళ్యాణము జరుగునని గ్రామ ప్రజలు నిశ్చయించినారు. కావున భక్తాదులు విరివిగా పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించి శ్రీసీతారాముల వారి కృపకు పాత్రులు కాగలరని కోరుచున్నాము తెలిపారు. సాయంత్రం 4 గంటలకు దేవుని ఊరేగింపు. రాత్రి 10 గంటలకు జానపద బృందంచే పాటలు ఉండును. 31 శుక్రవారం ఉదయం 08:00 గంటలకు ముగ్గుల పోటీలు ప్రారంభమగును. అందరికీ బహుమతులు ఇవ్వబడును స్లోసైకిల్ పందెం లను నిర్వహించబడును వారు తెలిపారు. పొట్టేల పందెంలో గెలుపొందిన వారికిప్రథమ బహుమతి 5 తులాలు వెండి ద్వితీయ బహుమతి 3 తులాలు వెండి ఇవ్వబడునని వారు పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో ఎలా నాయుడు. శ్రీరాములు గౌడ్ గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## వైసీపీలో ఇంకా అసమ్మతి నేతలు...?



విజయవాడ, మార్చి 28, వైసీపీలో ఏం జరుగుతోంది? ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎదురైన ఓటమిపై పార్టీలో ఎలాంటి చర్చ జరుగుతోంది? అధినాయకత్వం ఆలోచనలు ఎలా ఉన్నాయి? ఎమ్మెల్యేలు ఏం ఆలోచిస్తున్నారు? ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్ కు పాల్పడ్డారనే నెపంతో ఏకపక్షంగా నలుగురు ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయడాన్ని ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు, పార్టీ క్యాడర్ ఎలా చూస్తున్నారు? మరీ ముఖ్యంగా రాష్ట్ర భవిష్యత్ గురించి ప్రజల ఆలోచనలు ఎలా ఉన్నాయి? ఈ ప్రశ్నలన్నిటికీ సామాన్య ప్రజల నుంచి మేధావుల వరకు అందరూ అందరి నోటా వ్యక్తమౌతున్న ఏకాభిప్రాయం 'రోజులు దగ్గర పడ్డాయి' పట్టభద్రుల నియోజక వర్గాల్లో వైకాపా ఓటమి, ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబిస్తే, ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ ఎమ్మెల్యేలలో ఉన్న సొంత పార్టీపైనా, ప్రభుత్వంపైనా ఉన్న అసంతృప్తిని బహిర్గతం చేసిందని అంటున్నారు. ముఖ్యంగా, వైకాపా ఎమ్మెల్యేల్లో అసమ్మతి కొత్త వవిషయం కాదు. చాలా కాలంగా చాలా మంది ఎమ్మెల్యేల్లో అసమ్మతి అగ్గి రాగులు తూనే వుంది. భగ్గు మనేందుకు సిద్ధంగా వుంది. అయితే ఇంతకాలం పిల్లి మెడలో గంట కట్టేదేవరనే దగ్గర ఆగిన అసమ్మతి లావా ప్రవాహానికి స్వయంగా పార్టీ అధినాయకత్వమే గేట్లు ఎత్తేసింది. పొమ్మన కుండా పొగ పెట్టి ఆనం రామ నారాయణ రెడ్డి, కోటం రెడ్డి శ్రీధర్ రెడ్డిని బయటకు పంపిన పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి జగన్ రెడ్డి క్రాస్ వోటింగ్ సాకు చూపి మేకపాటి చంద్రశేఖర్ రెడ్డితో పాటు మహిళా ఎమ్మెల్యే ఉ ండవల్లి శ్రీదేవి పై సస్పెన్షన్ వేటు వేశారు. దీంతో ఇక అసమ్మతి కట్టలు తెంచుకుంటుందన్న పార్టీ లో చర్చ మొదలైంది. వైసీపీలో చాలా మంది ఎమ్మెల్యేలు తీవ్ర అసంతృప్తితో రగిలిపోతున్నారని సస్పెన్షన్‌కు గురైన నెల్లూరు గ్రామీణ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. కొందరు ఎమ్మెల్యేలు, నాయకులు బహిరంగంగానే బయటికి వస్తున్నారని తెలిపారు. ఈ మేరకు ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీలో చాలా మంది లోలోపల ఉడికిపోతున్నారని చెప్పారు. మరో పార్టీలో చేరిక కోసం చాలా మంది ఎమ్మెల్యేలు ఆలోచిస్తున్నారని వ్యాఖ్యానించారు. 2024 ఎన్నికలలో ఎవరికి ఓటేయాలన్న విషయంలో రాష్ట్ర ప్రజలు ఇప్పటికే నిర్ణయం తీసుకున్నారని ఎమ్మెల్యే కోటంరెడ్డి వెల్లడించారు. వచ్చే ఎన్నికల తరువాత రాష్ట్ర రాజకీయాల నుంచి వైసీపీ శాశ్వతంగా డిస్మిస్( సస్పెండ్) అవుతుందని జోస్యం చెప్పారు. 2024లో రాజకీయ ప్రజా సునామీ రాబోతోందని.. నిన్నటి పట్టభద్రుల ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమే స్పష్టమైన ప్రజా తీర్పు అని వ్యాఖ్యానించారు. ప్రజా సమస్యలు పరిష్కరించాలనే తపన ఉన్న తాను.. విసిగి వేసారి చివరికి గట్టిగా మాట్లాడానని ఎమ్మెల్యే కోటంరెడ్డి తెలిపారు. చివరికి పార్టీ (వైసీపీ)కి విధేయుడిగా ఉన్న తనపైనే నిఘా పెట్టారన్నారు. ప్రజా సమస్యలు ప్రస్తావిస్తే అనుమానించారని.. పరిష్కరించకుండా రాజకీయ కోణంలో ఆలోచించారని చెప్పారు. అదలా ఉంటే, కడప మొదలు ప్రతి జిల్లాలోనూ, వైకాపా ఎమ్మెల్యేలు, నాయకులు,కార్యకర్తలు జగన్ అనుకూల, వ్యతిరేక వర్గాలుగా నిట్టనిలువుగా చీలిపోయారని అంటున్నారు. అక్కడక్కడా రహస్య సమావేశాలు జరుగుతున్న సమాచారం కూడా పార్టీ పెద్దలకు చేరుతోందని అంటున్నారు. అందుకే ముఖ్యమంత్రి జగన్ రెడ్డి పార్టీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతల ప్రతి కదలిక పైనా ఒకరికి తెలియకుండా మరొకరిని నిఘా పెట్టినట్లు తెలుస్తోంది.దీంతో పార్టీలో ఒకరిని ఒకరు నమ్మే పరిస్థితి లేకుండా పోయిందని, చివరకు మంత్రులు కూడా రాజకీయాల గురించి మాట్లాడేందుకు జంకుతున్నారని అంటున్నారు. ఈ పరిణామాలను గమనిస్తే నిజంగానే కోటంరెడ్డి అన్నట్లుగా వైసీపీని అసమ్మతి సునామీ ముంచేసేలా ఉందని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు.

## అనుకున్నంతా వీజీయేం కాదు

విజయవాడ, మార్చి 28, 'కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి!' అని మన మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం అన్నారు. ఆ మాటలను అందిపుచ్చుకుందేమో 2024లో అధికారంలోకి రావాలని టీడీపీ కూడా కలలు కంటోంది గానీ, వాటిని సాకారం చేసుకోవడానికి మాత్రం పూర్తిస్థాయిలో కష్టపడటం లేదు. యుద్ధం ముంచుకొస్తున్నది. వైఎస్సార్సీపీని ఎదుర్కోవడానికి అవసరమైన బలం, బలగం తమకు ఉందా? అధికార పక్షాన్ని కూల్చగల క్షేత్రస్థాయి వ్యూహాలు, ఢీ కొట్టగొల సారథులు తమవైపు ఉన్నారా? అని టీడీపీ ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సమయమిది.ఇవేమీ పట్టించుకోకుండా తాజాగా నాలుగు ఎమ్మెల్సీ స్థానాలు గెలవడంతోనే యద్ధం గెలిచేశామని, అధికారంలోకి వచ్చేశామని కొంతమంది తెలుగుదేశం నాయకులు పగటి కలలు కంటున్నారు. మరికొందరు ఓ అడుగు ముందుకేసి 'వచ్చే ఎన్నికల్లో ఒంటరిగానే గెలుస్తాం. మాకు ఎవరి అవసరం లేదు' అని ఉత్తరకుమార ప్రగల్భాలు పలుకుతున్నారు. వీరి మాటలు నమ్మి టీడీపీ ఒంటరిగా పోటీచేస్తే, మరోసారి వైఎస్సార్సీపీ నెత్తిలో పాలుపోసినట్టే!2014 ఎన్నికల్లో జనసేన, బీజేపీతో కలిసి పోటీ చేసిన టీడీపీకి రాష్ట్రవ్యాప్తంగా వైఎస్సార్సీపీ కంటే కేవలం 6 లక్షల ఓట్లే అధికంగా వచ్చాయి. వాటితోనే 117 సీట్లలో విజయం సాధించి అధికార పీఠం ఎక్కింది. అదే 2019 ఎన్నికల్లో గెలిచిన వైఎస్సార్సీపీకి రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం ఓట్లలో టీడీపీ కంటే 33 లక్షల 83 వేల ఓట్లు అధికంగా వచ్చాయి. దాంతో ఆ పార్టీ 151 స్థానాలను కైవసం చేసుకుంది. 175 నియోజకవర్గాల్లో సగటున లెక్కిస్తే వైఎస్సార్సీపీకి వచ్చిన ఓట్లను సమం చేయడానికే 19 వేలకు పైచిలుకు ఓట్లను టీడీపీ పూడ్చుకోవాల్సి ఉంటుంది.పైగా, ఒంటరిగా పోటి చేసిన జనసేన ఖాతాలో 17 లక్షలకు పైగా ఓట్లు ఉన్నాయి. ఈసారి అవి రెట్టింపు అయ్యే అవకాశాలు స్పష్టంగా ఉన్నాయి. మరోవైపు, 2019లో 20 శాతానికి పైగా ఓట్లతో మెజారిటీ సాధించిన వైఎస్సార్సీపీ అభ్యర్థులు 27 మంది, 10 శాతం కంటే ఎక్కువ ఓట్లతో మెజారిటీ సాధించిన అభ్యర్థులు 39 మంది ఉన్నారు. ఇక 5 ఎస్టీ, 11 ఎస్సీ రిజర్వ్ డ్ అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ 2009 నుంచీ గెలవడం లేదు. క్షేత్రస్థాయి పరిస్థితులు ఇలా ఉంటే, టీడీపీ చంకలు గుద్దుకుంటూ విలువైన కాలాన్ని కరగదీస్తోంది.పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి వచ్చింది ప్రభుత్వం మీద ఉన్న వ్యతిరేకత తాలూకు నెగెటివ్ ఓటింగేగానీ, ఆ పార్టీ మీద అభిమానంతో వచ్చిన పాజిటివ్ ఓటింగ్ కాదు. పీపుల్స్ పల్స్ సంస్థ క్షేత్రస్థాయిలో తిరుగుతున్నప్పుడు 'బాబు వస్తే మా జీవితాలు మారుతాయి' అని ఎక్కడా చెప్పడం లేదు. కేవలం అధికార వైఎస్సార్సీపీ మీద ఉన్న వ్యతిరేకత వల్ల, మరో ప్రత్యామ్నాయం లేకనే ప్రజలు టీడీపీ వైపు చూస్తున్నారు. కేవలం నెగిటివ్ ఓటింగ్‌తో అధికారం సొంతం చేసుకోవడం కష్టం. ఈ క్రమంలో చంద్రబాబు నాయుడు తన ఇమేజ్ పెంచుకోవడం అత్యవసరం. ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తారని, మేనేజ్‌మెంట్ రాజకీయాలు చేస్తారనే అప్రతిష్టను ఆయన తక్షణమే తొలగించుకోవాలి.'అధికారంలోకి రాగానే వడ్డీతో సహా చెల్లిస్తాం' అనే మాట చంద్రబాబు నాయుడి ఇటీవలీ ప్రసంగాల్లో ఎక్కువగా వినపడుతోంది. అంటే దీని అర్థం, వైఎస్సార్సీపీ విధ్వసంకర పాలనను వ్యతిరేకిస్తూ రేపు పొద్దున అధికారంలోకి వస్తే అంతకన్న విధ్వంసం చేస్తామనా? కక్ష సాధింపులు ఉండవనీ, అభివృద్ధి చేస్తామని హామీ ఇవ్వాల్సిందిపోయి చంద్రబాబు తనను తాను దిగజార్చుకుంటున్నారు. ఇమేజ్ బిల్డింగ్ విషయంలో బ్లూ మీడియాను నమ్ముకొని జగన్ ఎలా మునిగిపోతున్నారో, పచ్చ మీడియాను నమ్ముకొని చంద్రబాబు కూడా అలాగే మోసపోతున్నారు.మొన్న జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో మొత్తం మూడు పట్టభద్రుల స్థానాలకు కలిపి 7 లక్షల 16 వేల 664 ఓట్లు పోలయ్యాయి. వాటిలో చెల్లిన ఓట్లు 6 లక్షల 63 వేల 782. ఇందులో టీడీపీకి 2 లక్షల 89 వేల 630 ఓట్లు రాగా, అధికార వైఎస్సార్సీపీకి 2 లక్షల 36 వేల 972 ఓట్లు వచ్చాయి. ఈ రెండు పార్టీల మధ్య వ్యత్యాసం 52 వేలు. టీడీపీకి వచ్చిన మెజారిటీ 54 వేల ఓట్లు. వైఎస్సార్సీపీ, టీడీపీల నుంచి వచ్చిన రకరకాల ప్రలోభాలను తిరస్కరించి ఇంచుమించు లక్ష మంది పట్టభద్రులు పీడీఎఫ్ అభ్యర్థులకు ఓటు వేశారంటే, వామపక్షం పలుకుబడిని, ప్రభావాన్ని అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పీడీఎఫ్ ఓటర్లు రెండో ప్రాధాన్యతగా టీడీపీకి ఓటు వేయడం వల్లే మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో ఆ పార్టీ విజయం సాధించింది. క్షేత్రస్థాయిలో వామపక్షాలు, జనసేన, టీడీపీ కలిసి పనిచేయడంతో టీడీపీ లాభపడిరది. రెండో ప్రాధాన్యతతో దక్కిన ఈ విజయాలు టీడీపీకి రెండో పార్టీ అవసరమని నొక్కి చెప్తున్నాయి. ఇది పట్టించుకోకుండా ఒంటరిగా పోటి చేసినా గెలుస్తామని కొంతమంది ప్రబుద్ధులు గాలిమేడలు కట్టడం హాస్యాస్పదం.

## ఎమ్మెల్యేపై టీడీపీ నేత పిర్యాదు

మచిలీపట్నం తనను చంపుతానని ఎమ్మెల్యే కైలె అనిల్ కుమార్ అనుచరులు బెదిరిస్తున్నారని ఎస్పి కు పామర్రు టిడిపి ఇంచార్జ్ వర్ల కుమార్ రాజా పిర్యాదు చేసారు. పామర్రు నియోజకవర్గంలో లోపించిన శాంతి భద్రతలను పరిరక్షించాలని కోరుతూ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ వర్ల కుమార్ రాజా జిల్లా ఎస్పీ జాషువాను కోరారు. అడ్డాడ గ్రామంలో ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అనుచరులు గ్రామ చెరువులో మట్టిని అక్రమంగా దోచుకునేందుకు దేవత విగ్రహాన్ని సైతం పక్కకు తొలగించారని ఆరోపించారు. దేవత విగ్రహం విషయంలో అపచారానికి పాల్పడటం, అక్రమంగా మట్టిని కాజేయడాన్ని ప్రశ్నించినందుకు తమను చంపేస్తామంటూ ఎమ్మెల్యే అనుచరులు వీడియో మెసేజ్ లు పెట్టి బెదిరిస్తున్నారన్నారు.ప్రజాస్వామ్య విలువలను అపహాస్యం చేస్తున్న ఎమ్మెల్యే అనుచరుల ఆగడాలను అరికట్టాలని, చెరువు తవ్వకం బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## టీడీపీ, జనసేనతో కలిసే పోటీచేస్తాం

### సీపిఐ నారాయణ



గుంటూరు రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష పార్టీలతో కలిసి సీపీఐ ఎన్నికల బరిలో నిలవబోతుందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ వెల్లడించారు. మంగళవారం నాడు అయన గుంటూరులో మీడియాతో మాట్లాడారు. కలవడం అంటూ జరిగితే మా ఓట్లు ఇవ్వడం మాత్రమే కాదు.. మాకు సీట్లు కూడా కావాలని స్పష్టం చేశారు.. ఇక, వీరుడు, సూరుడు అనుకున్న జగన్.. కేంద్రం దగ్గర మోకరిల్లుతున్నాడని విమర్శలు గుప్పించారు.. పోలవరం విషయంలో వాళ్ల నాన్న వైఎస్ లో ఉన్న పోరాట స్ఫూర్తి జగన్ లో కనిపించడం లేదన్న ఆయన.. వాళ్ల నాన్న సిద్ధాంతాలకు కూడా పంగ నామాలు పెట్టిన వ్యక్తి గా జగన్ మిగిలిపోయేలా ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రయోజనాల కోసం సలహాలు ఇచ్చినా తీసుకునే తత్వం సీఎం వైఎస్ జగన్ కు లేదని విమర్శించారు నారాయణ.. పోలవరం ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి వీడాలి.. పోలవరం ఎత్తు పెంచడంతో పాటు నిర్వాసితులకు నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. పోలవరం విషయంలో విభజన హామీల హక్కులు సాధించడంలో రాష్ట్ర ప్రభుత్వం వెనుక బడిపోయిందన్నారు.. మీకు, పోరాడటానికి భయంగా ఉంటే అఖిల పక్షానికి ఢిల్లీ తీసుకువెళ్ళండి, విభజన హామీలు మేం సాధించుకు వస్తాం అంటూఏ ప్రకటించారు.

## తెలంగాణతో పాటు ముందస్తు అడుగులు

విజయవాడ, మార్చి 28, ముందు చూస్తే నుయ్యి వెనక చూస్తే గొయ్యి .. ఎటూ పోలేని పరిస్థితిలో జగన్ రెడ్డి ప్రభుత్వం ఉందా అన్న ప్రశ్నకు ప్రజల నుంచీ, రాజకీయ పరిశీలకుల నుంచీ కూడా ఔననే సమాధానమే వస్తోంది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల విషయానికి వస్తే.. పరిస్థితి ప్రభుత్వానికి అగమ్య గోచరంగా ఉ ంది. ముందు ముందు తన ఫ్లాగ్ మార్క్ గా చెప్పుకుంటున్న బటన్ నొక్కుడు సంక్షేమం పందేరం చేయడం అసాధ్యంగా మారిపోతుంది. అందుకే పథకాల అమలు ఆగిపోకముందే ముందస్తుకు వెళ్లడమే మంచిదన్న నిర్ణయానికి జగన్ వచ్చేశారని అంటున్నారు. అందుకే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలతో పాటే ఏపీ అసెంబ్లీలు కూడా జరిగే విధంగా జగన్ వ్యూహరచనలో ఉన్నారని అంటున్నారు. ముందస్తు ఎన్నికలకు పోదామంటే, ముందుగానే ఇంటికి పోతామని సొంత పార్టీ ఎమ్మెల్యేలే సెటైర్లు వేస్తున్నారు. ఐదేళ్ల సమయం పూర్తయ్యే దాకా ఆగుదామా అంటే.. అయ్యో అలా ఎలా మొదటికే మోసం వస్తుందని మళ్లీ వాళ్లే అంటున్నారు. టుబీ ఆర్ నాట్ టుబి అన్నట్లుగా ఎటూ తేల్చుకోలేని పరిస్థితిలో జగన్ కొట్టుమిట్టాడుతున్నారని పరిశీలకులు అంటున్నారు. అందుకే అధికార పార్టీ నేతలు ముందస్తు ఎన్నికల అట్టును అటూ ఇటూ తిరగేస్తున్నారని విశ్లేషిస్తున్నారు.వాస్తవానికి ముందస్తు ముచ్చటను తెరపైకి తీసుకువచ్చినదే వైసీపీ నేతలు. ఎమ్మెల్సీ ఎన్నికల ఓటమి కంటే చాలా చాలా ముందుగానే.. ఒకటికి పది సార్లు వైసీసీలో, జగన్ రెడ్డి ప్రభుత్వంలో సకల శాఖల మంత్రిగా చెలామణి అవుతున్న సజ్జల రామకృష్ణా రెడ్డి ఏడాది ఏణ్ణర్థం ముందు నుంచే ముందస్తు ఉ ండనీ లేదనీ చెబుతూ చర్చను ఎప్పటికప్పుడు సజీవంగా ఉంచుతూ వస్తున్నారు. నిజానికి ప్రతిపక్ష పార్టీలు ముందస్తు ఎన్నికలకు సంబంధించి అధికార పార్టీ వ్యూహాత్మక తప్పటడుగులను, తప్పుటడుగులను పెద్దగా పట్టించుకోవడం లేదు. అలాగే ప్రజలు కూడా ముందస్తు ఉంటుందా, ఉండదా అన్న విషయంపై ఇసుమంతైనా ఆసక్తి చూపడంలేదు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా 'ఒక్క ఛాన్స్' మోసానికి గట్టిగానే బదులు తీర్చుకోవాలన్న నిర్ణయానికి వచ్చేశారు. ప్రజల నిర్ణయం, విపక్షాల వ్యూహాలు, ఉద్దేశాలతో పని లేకుండా జగన్ ముందస్తే మార్గమన్న నిర్ణయానికి వచ్చేసినట్లు ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాల తరువాత పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. దీంతో ఏపీలో ముందస్తు ముహూర్తంపై చర్చోపచర్చలు జోరందుకున్నాయి. పొరుగు రాష్ట్రం తెలంగాణలో ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఏపీలో కూడా అదే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశం ఉందన్న అభిప్రాయం రాజకీయ వర్గాలలో వ్యక్త మౌతోంది. జగన్ కూడా అదే సమయానికి ఎన్నికలకు వెళితే బెటర్ అని భావిస్తున్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీ వర్గాల్లో వ్యక్తమౌతోంది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల వరకూ ఆగకుండా, వీలైతే అంత కంటే ముందుగా ఎన్నికలు జరిపిస్తే వైనాట్ 175 కాకపోయినా.. కొద్దో గోప్పో స్థానాలను గెలుచుకుని పరువు కాపాడుకునే అవకాశం ఉంటుందని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఒక సారి ప్రజలలో వ్యతిరేకత ఉ ందన్న విషయం బయటపడిన తరువాత ఎన్నికలు ఎంత ఆలస్యమైతే విపక్షం అంత బలపడుతుందని ఆ వర్గాలు చెబుతున్నాయి. ఇక చేతులు పూర్తిగా కాలిపో యాయి. ఆకులు పట్టుకున్నా ప్రయోజనం లేదు అన్న భావన పార్టీ నాయకులలోనే వ్యక్తమౌతోంది. అందుకే ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలలో నిర్భయంగా నలుగురు అధికార పార్టీ ఎమ్మెల్యేలు క్రాస్ ఓటింగ్ కు పాల్పడ్డారు. సాంకేతికంగా అసెంబ్లీలో తెలుగుదేశంకు ఉన్న బలం మేరకే ఓట్లు పడినప్పటికీ.. వాస్తవ బలం కంటే నాలుగు ఓట్లు ఆ పార్టీకి ఎక్కువ పడిన సంగతి సుస్పష్టమే. సొంత పార్టీ ఎమ్మెల్యేలే, ఇంకా ఏడాదికి పైగా ప్రభుత్వానికి గడువు ఉందని తెలిసీ క్రాస్ ఓటింగ్ చేశారంటే.. వారిలో జగన్ సర్కార్ పట్ల ఎంత అసంతృప్తి గూడు కట్టుకుందో అర్థం చేసుకోవచ్చు జగన్ సర్కార్ పై, జగన్ తీరుపై అసంతృప్తి ఉన్న ఎమ్మెల్యేల సంఖ్య 16 అని అధికార పార్టీ అగ్రనాయకత్వమే నిర్ధారణకు వచ్చేసింది.

# ఘనంగా 3వ విడత వైయస్సార్ ఆసరా

---నంద్యాల అర్బన్, రూరల్ పరిధిలోని అక్క చెల్లెమ్మలకు రుణమాఫీ చెక్కులను అందజేసిన ఎమ్మెల్యే ఎమ్మెల్సీ




నంద్యాల మా ప్రతినిధి (విభారె న్యూస్) వైయస్సార్ ఆసరా పథకం ద్వారా 3వ ఏడాది 3వ విడత ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి అక్క చెల్లెమ్మలకు నాడు ఇచ్చిన మాట ప్రకారం వరుసగా క్రమం తప్పకుండా రుణమాఫీ చేపడుతున్నారు. ఈ ఏడాది రాష్ట్రంలో 3వ విడతగా 6,419. 89 కోట్ల రూపాయలు రుణమాఫీ చేశారు. మార్చి 25వ తేదీ నుండి ఏప్రిల్ 5వ తేదీ వరకు అక్కాచెల్లెమ్మలు ఆసరా సంబరాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. మంగళవారం నంద్యాల మున్సిపల్ టౌన్ హాల్ నందు ఎమ్మెల్యే శిల్ప రవిచంద్ర కిషోర్ రెడ్డి ఆధ్వర్యంలో మూడవ విడత వైయస్సార్ ఆసరా సంబరాలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నంద్యాల పట్టణ, రూరల్ పరిధిలోని అక్క చెల్లెమ్మలకు ఎమ్మెల్యే చేతుల మీదుగా 23 కోట్ల 73 లక్షల 80 వేల 319 రూపాయల మెగా చెక్కులను అందజేశారు. అనంతరం కేక్ కట్ చేసి, ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో వైయస్ ఆర్ సీపీ పార్టీ కౌన్సిలర్లు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలి

సిపిఐ జిల్లా నాయకులు



నంద్యాల మా ప్రతినిధి (విభారె న్యూస్ ) పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయాలని. సిద్దేశ్వరం అలుగునిర్మానం చేపట్టాలని కోరుతూ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం వద్ద 2వ రోజు రిలే నిరాహార దీక్షలు సిపిఐ జిల్లా కార్యదర్శిఎన్.రంగనాయుడు దీక్షలో కూర్చున్న వారికి పూలమాలవేసి ప్రారంభం చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి. సిపిఐ పట్టణ కార్యదర్శి. కె. ప్రసాద్ అధ్యక్షు వహించడము జరిగింది. ఈ దీక్షలలో. సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్. బాబా ఫక్రుద్దీన్. సిపిఐ ఆళ్లగడ్డ మండల కార్యదర్శి కె భాస్కర్.ఆత్మకూర్ తాలూకా కార్యదర్శి.శ్రీనివాసులు. సిపిఐ జిల్లా సమితి సభ్యులు.సంజీవులు. శివ బాలకృష్ణ.కాలంగి రాముడు.ప్రతాపు. ఎద్దు పెంట నాగప్ప. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు.సురేషు. సిపిఐ నాయకులు ఖాదర్ బాషా. సింగం పుల్లయ్య.చిన్న ఆంజనేయులు పెద్ద ఆంజనేయులు.ఆంజనేయులు నరసింహులు మల్లయ్య బాలపర్తి రాజు. మహిళా నాయకురాలు. హసీనాబీ. నరసమ్మ. లక్ష్మీదేవి. గుర్రమ్మ. రేణుక. దీక్షలలో కూర్చోవడం జరిగింది. నిరాహార దీక్షలను ఉద్దేశించి సిపిఐ జిల్లా కార్యదర్శి. ఎన్. రంగనాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో నీటి వివాదాలపై ఏర్పాటైన బచావత్ ట్రిబ్యునల్ తీర్పు ప్రకారం, కేంద్ర జలవనరుల సంఘం చేత ఆమోదం తెలపబడి 1980లో శంకుస్థాపన చేయబడి, 2005లో ప్రారంభించబడి, 2014 రాష్ట్ర విభజన చట్టంలో జాతీయ హోదా కల్పించబడిన పోలవరం ప్రాజెక్టు కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి గురై పూర్తికి నోచుకోకపోగా, సామర్థ్యం తగ్గించే కుట్ర జరుగుతున్నదన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ఈ రాష్ట్ర ప్రజల ప్రయోజనాల కోసం పోలవరం ప్రాజెక్టు కట్టాలని ప్రయత్నించినటువంటి కుమారుడు నేడు రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్న జగన్మోహన్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం ఎత్తు తగ్గిస్తామంటే నోరు మెదపకుండా మూగనోమునోస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పదవి కోసం 175 కు 175 సీట్లు రావాలని చెబుతున్న జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో ఉన్నటువంటి ప్రజలకు అవసరమైనటువంటి త్రాగునీరు సాగునీరు పరిశ్రమలకు నీటి సౌకర్యం రైతులకు సాగునీరు రాష్ట్రానికి గుండెకాయగా ఉన్నటువంటి పోలవరం ప్రాజెక్టు 150 అడుగుల గరిష్ట నీటిమట్టంతో,294 టీఎంసీల సామర్థ్యంతో 7.20 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీటిని,కోట్లాదిమంది తాగునీటిని, 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే పోలవరం ప్రాజెక్టు అనేకమార్లు సవరించిన తరువాత 2017-18 నాటికి అంచనా వ్యయం 55,656.87 కోట్లలో, జల విద్యుత్తు కేంద్రానికి అయ్యే 4,124.64 కోట్లు మినహా మిగిలిన మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాల్సి ఉండగా విభజన హామీలను విస్మరిస్తున్న మోడీ ప్రభుత్వం పోలవరం పై రోజుకొక షరతు విధిస్తూ,నిధుల కేటాయింపుల్లో తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి నిర్దిష్ట కాలవ్యవధిలో పూర్తి చేసి పోలవరాన్ని జాతికి అంకితం చేస్తానన్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వ్యక్తిగత ప్రయోజనాల కోసం పోలవరాన్ని మోడీకి తాకట్టు పెడుతోందన్నారు.పోలవరం ప్రాజెక్టు పూర్తి కావడం ద్వారా గోదావరి నది జలాలను కృష్ణా బేసిన్ కు తరలించడం ద్వారా కృష్ణా జలాలను కరువు పీడిత రాయలసీమలో చేపట్టిన గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగు గంగ, వెలుగొండ ప్రాజెక్టులకు నీటిని సర్దుబాటు చేసుకునే వెసులుబాటు ఉంటుందన్నారు. పోలవరం సామర్థ్యాన్ని 150 అడుగుల నుండి 90 అడుగులకు కుదించడం వల్ల ప్రాజెక్టు నీటి సామర్థ్యం తగ్గిపోయి బ్యారేజిగా మారి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అందులో రాయలసీమ ఎక్కువ నష్టపోతుందన్నారు.ఒకవైపు ఎగువ రాష్ట్రమైన కర్ణాటక బిజెపి ప్రభుత్వం బచావత ట్రిబ్యునల్ తీర్పులకు విరుద్ధంగా ఎగువభద్ర నిర్మాణానికి పూనుకోవడమే కాకుండా కేంద్రంలో బిజెపి ప్రభుత్వ సహకారంతో జాతీయ హోదా కల్పించడమే కాకుండా బడ్జెట్లో 5300 కోట్లు కేటాయించి యుద్ధ ప్రాతిపదికన నిర్మాణానికి పూనుకొని రాయలసీమ ప్రాంతాన్ని స్మశాన వాటికగా చేయాలని కేంద్ర ప్రభుత్వం చూస్తున్న జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం కళ్ళుండి గుడ్డి వారిలాగా నోరు ఉండి మూగవాళ్ళలాగా తయారయ్యారని విమర్శించారు.కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల.ప్రధానిమోడీ, ముఖ్యమంత్రి జగన్ సర్కార్ ఇరువురు కలిసి రాష్ట్రాన్ని నిలువునా మోసం చేస్తున్నారన్నారు.జగన్మోహన్ రెడ్డి కి చిత్తశుద్ధి ఉంటే పోలవరం ప్రాజెక్టు పూర్తి కోసం కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు రాష్ట్రంలో అన్ని పార్టీలను ఏకం చేయాలని అఖిలపక్ష కమిటీతో ఢిల్లీలో ఉన్నటువంటి కేంద్ర ప్రభుత్వంపై పోరాటం చేయాలని రాష్ట్రంలో దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి మొదలు పెట్టినటువంటి ప్రాజెక్టులు నేను పూర్తి చేస్తానన్నటువంటి మడమ తిప్పను మాట తప్పను అని చెప్పే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు తాగునీరు సాగునీరు అందించడంలో చిత్తశుద్ధి చూపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి జి నాగరాముడు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు.ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎర్రిస్వామి. సిపిఐ నాయకులు మధు. లింగయ్య. సిపిఐ జిల్లాసమితి సభ్యులు ఆర్.సామేలు . ప్రసాదు. సిపిఐ నాయకులు.వెంకటేశ్వర్లు. చంద్రమణి. అల్లా బకస్. సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

# బివై.యస్.ఆర్ ఆసరా సంబరాలు ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మిగనూరు ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవరెడ్డి ...

విభారే ప్రతినిధి.... ఎమ్మిగనూరు పట్టణంలో మార్చి 28 మంగళవారం నాడు వై.యస్.ఆర్ ఆసరా మహిళ లబ్ధిదారులకు వై.యస్.ఆర్. ఆసరా పథకం ద్వారా 784 గ్రూపులకు 7882 మంది కి " వై.యస్.ఆర్. ఆసరా" 3వ విడత జమ×బినాలుగు కోట్ల పదహారు లక్షల ఎనభై మూడు వేల రూపాయలు 4,16, 83,000/- చెక్ ను లబ్ధిదారులకు అందజేస్తున్న ఎమ్మెల్యే "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి"×జగనన్న హయంలో మహిళలకే అధిక ప్రాధాన్యత డబ్బుతో ఎమ్మెల్యేలను కొని టిడిపి రాజకీయం చేస్తోంది. రాజకీయ పార్టీల తల రాతలు మార్చేది పేదలే ప్రజలు ఆర్థికంగా అభివృద్ధి చెందడం కోసం 2 లక్షల కోట్లు కేటాయించిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్న మాత్రమే రాబోయే రోజుల్లో మంచి పరిశ్రమలు రాష్ట్రానికి వస్తున్నాయి.×బివైస్సార్సీపీ జగన్ అన్న ప్రభుత్వం లో అందరికంటే ఎక్కువ ప్రాముఖ్యత ఇచ్చేది మహిళలకే నని ఎమ్మిగనూరు శాసనసభ్యులు "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి" పేర్కొన్నారు. మంగళవారం (28-03-2023) తేదీన ఎమ్మిగనూరు పట్టణంలో ఉప్పర కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన వైయస్సార్ ఆసరా మూడవ విడత సంబరాల సభలో ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన ఎమ్మెల్యే "ఎర్రకోట చెన్నకేశవరెడ్డి" ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వంలో మహిళలు గర్వంగా బ్రతకగలుగుతున్నారని, మహిళలకు ఒక అన్నగా ఒక తమ్ముడిగా అండగా నేడు జగనన్న ఉన్నాడని మహిళలు గట్టిగా నమ్ముతున్నారని అన్నారు. మహిళల పట్ల, పేదల పట్ల వారి ఆకలి పట్ల వారి కష్టాల పట్ల గతంలో ఉన్న ఏ ఒక్క నాయకుడు ఆలోచించలేదు, కేవలం వారిని ఓటు బ్యాంకుగా మాత్రమే అందరూ చూశారు అన్ని అన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రం ఆయనపై ఎన్ని కుట్రలు, ఎన్ని కుతంత్రాలు చేసినా, ఎన్ని ఆర్థిక ఇబ్బందులు వచ్చినా, కరోనా ఇలాంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా, వాటన్నింటిని తట్టుకొని ప్రతి నెల, ప్రతి సంవత్సరం అందరికీ పెన్షన్, అమ్మ ఒడి, ఆసరా లాంటి 25 పథకాలను నేరుగా బటన్ నొక్కి ప్రజల ఖాతాల్లోకి డబ్బులు వచ్చి పడేలా జగనన్న కృషి చేస్తున్నారని అన్నారు. ఎలాంటి దళారీ వ్యవస్థను లేకుండా నేరుగా ప్రజల వద్దకే పథకాలను చేర్చిన ఘనత జగనన్నదని అన్నారు. ప్రజల ఇంటి వద్దకే పథకాలను, ప్రజా ప్రతినిధులను వచ్చేలా చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డి అన్ని వారు పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ విద్య బోధన, నాడు నేడు ద్వారా పాఠశాలల అభివృద్ధి పెంచి, ప్రభుత్వ పాఠశాలలో ప్రస్తుతం సీట్లు ఖాళీ లేని పరిస్థితికి తీసుకురావడం జగనన్నకే సాధ్యమన్నారు. జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన, పాఠశాలల అభివృద్ధి, ఉచిత పుస్తకాలు, ఉచిత బ్యాగులు, జగనన్న గోరుముద్ద లాంటి పథకాలు విద్యార్థుల కోసం చేపట్టడం జరిగిందన్నారు. పిల్లలు బలంగా ఉండాలని కోరుకునే ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన్ రెడ్డి అన్ని అన్నారు. ప్రతిపక్ష టిడిపి పార్టీ ఎమ్మెల్యేలను డబ్బుతో కొనుగోలు చేసి రాజకీయం చేస్తున్నారని, జగనన్న మాత్రం రాజకీయాల కతీతంగా అందరికీ నవరత్నాలు అందేలా కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే ఎమ్మిగనూరు మండల ప్రజల ఖాతాల్లో 8 కోట్ల 34 లక్షల రూపాయలు పడింది అన్నారు. ప్రజలు జగనన్నకు ఓటు వేయడం వల్ల వాలంటీర్ వ్యవస్థ, సచివాలయ వ్యవస్థ, ఆరోగ్య శ్రీ కార్డుల ద్వారా ఆపరేషన్లు తదితర సౌకర్యాలు కల్పించడం జరిగిందని అన్నారు. రాజకీయ పార్టీల రాతలు మార్చేది పేదవారే నన్నారు. ఇంత పెద్ద మొత్తం కాంట్రాక్టర్లకు, పారిశ్రామికవేత్తలకు, పెత్తందారులకు ఇవ్వలేదని అక్కసు, కడుపు మంటతో ప్రతిపక్షాలు ముఖ్యమంత్రిపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని, కేవలం పేదలకు జగనన్న మేలు చేస్తున్నాడనే కారణంతో, జగనన్న పై ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయని, ఇటువంటి సందర్భంలో జగనన్నకు తోడుగా జనం అంతా నిలవాలని పిలుపునిచ్చారు.

# రైతు నగరంలో 35 లక్షల తో నూతన సచివాలయం

- - - నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవి చంద్ర కిషోర్ రెడ్డి..



నంద్యాల మా ప్రతినిధి ( విభారె న్యూస్ ) నంద్యాల మున్సిపాలిటీ పరిధిలోని 22వ వార్డు రైతు నగరం నందు కౌన్సిలర్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో 35 లక్షల రూపాయలతో నూతన గ్రామ సచివాలయాన్ని నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ . ఈషాక్ బాషా, మార్కెట్ చైర్మన్ పి పి నాగిరెడ్డి, నంద్యాల మున్సిపల్ చైర్ పర్సన్ మాబున్నిసా, మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్ , వైయస్ఆర్సిపి నాయకులు రామసుబ్బారెడ్డి మరియు రైతు నగరం వైసిపి నాయకులు పాల్గొన్నారు...ఈ సందర్భంగా నంద్యాల శాసనసభ్యులు శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన గ్రామ వార్డు సచివాలయాలు ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటూ ప్రజల సమస్యలను పరిష్కరించడానికి మంచి అవకాశం ఉందన్నారు. అలాగే కొన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా సచివాలయాలు నిలిచాయని గాంధీజీ కలలు కన్నా స్వరాజ్యాన్ని ప్రజలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నంద్యాల నియోజకవర్గ ప్రజల తరఫున రాష్ట్ర ముఖ్యమంత్రి జగనన్నకు ప్రత్యేక ధన్యవాదాలు అని అన్నారు.

# మైండ్ బ్లాంక్ చేయిస్తోన్న చరణ్ లైనప్

రామ్ చరణ్ తేజ్.. చిరు తనయుడిగా ఇండ్రస్ట్రీలోకి అడుగు పెట్టి... ఇప్పుడు తనకంటూ ఓ ప్రత్యేకమైన గుర్తింపు సాధించుకున్నాడు. మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించిన రామ్ చరణ్.. రెండవ సినిమాతో అప్పటివరకు ఉన్న రికార్డులన్నీ కొల్లగొట్టారు. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కిన మగధీరతో..



మంచి క్రేజ్ను సంపాదించుకున్న తర్వాత వరుస సినిమాలతో మెప్పించాడు. ఇక మొన్న ఆర్ఆర్ఆర్ సినిమాతో గ్లోబల్ స్టార్గా ఎదిగాడు. రాజమౌళి దర్శకత్వంలె తెరకెక్కిన ఆర్ఆర్ఆర్ సినిమాతో రామ్ చరణ్ క్రేజ్ మరింత పెరిగిందనే చెప్పాలి. నాటు నాటు సాంగ్కు ఆస్కార్ అవార్డు రావడం... ప్రపంచవ్యాప్తంగా ఆయనకు ఫ్యాన్స్ ను తెచ్చిపెట్టింది. అయితే రామ్ చరణ్ లైనప్ ఒకసారి పరిశీలిస్తే.. వరుస సినిమాలతో బిజీ బిజీగా ఉన్నట్లు కనిపిస్తోంది. దిల్ రాజు నిర్మాతగా లెజెండరీ డైరెక్టర్ శంకర్ దర్శకత్వంలో ఆర్సీ 15 రాబోతున్న తెలిసిందే. ఈరోజు పుట్టిన రోజు సందర్భంగా టైటిల్ కూడా రివిల్ చేశారు. గేమ్ ఛేంజర్ అంటూ ప్రకటించారు. ఇక ఈ సినిమాను దిల్ రాజు భారీ బడ్జెట్తో తెరకెక్కిస్తున్నారు. కియారా అద్వానీ అంజలి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ప్రస్తుతం రామ్ చరణ్ ఈ సినిమా షూటింగ్లో బిజీగా ఉన్న విషయం తెలిసిందే.ఇక సుకుమార్ శిష్యుడు బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రామ్ చరణ్ సినిమా ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ సినిమాకు ఇంకా టైటిల్ పెట్టలేదు. ప్రస్తుతం ఆర్సీ 16 వర్కింగ్ టైటిల్తో ఈ సినిమా తెరకెక్కనుంది. ఈరోజు బర్త్డే సందర్భంగా చిత్ర యూనిట్ ఓ ప్రత్యేక పోస్టర్ను రిలీజ్ చేసింది. మైత్రీ మూవీ మేకర్స్ ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ను నిర్మించనుంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించి మరింత సమచారాన్ని అధికారికంగా అనౌన్స్ చేయనున్నారు.ఇదిలా ఉంటే ఈ సినిమా తర్వాత రామ్ చరణ్ యూవీ క్రియేషన్స్ బ్యానర్లో తన 17వ సినిమా చేయనున్నారు. ఆ తర్వాత మళ్లీ ఆర్ఆర్ఆర్ నిర్మాత డీవీవీ దానయ్య నిర్మాణంలో రామ్ చరణ్ తన 18వ చేయనున్నట్లు తెలిస్తోంది. ఇలా వరుస సినిమాలతో రామ్ చరణ్ బిజీ బిజీగా ఉన్నట్లు తెలుస్తోంది.

# రామ్ బోయపాటి కాంబో రిలీజ్ డేట్ కన్ఫర్మ్




ఎనర్జిటిక్ హీరో రామ్ పోతినేని అంటే ఇప్పటివరకు ఎక్కువగా కమర్షియల్ ఎంటర్టైనర్ సినిమాలు మాత్రమే చేస్తూ వచ్చాడు. అలాగే చాలా చిత్రాలలో స్టైలిష్ లుక్ లోనే రామ్ కనిపించడం విశేషం. మాస్ క్యారెక్టర్ చేసిన సినిమాలు ప్రేక్షకులకి కనెక్ట్ కాలేదు. అయితే మొదటిసారి అవుట్ అండ్ అవుట్ ఫుల్ మాస్ రోల్ లో రామ్ పోతినేని కనిపించబోతున్నాడు. ప్రస్తుతం రామ్ బోయపాటి శ్రీను దర్శకత్వంలో సినిమా చేస్తున్న సంగతి అందరికీ తెలిసిందే. పాన్ ఇండియా రేంజ్ లో తెరకెక్కుతున్న ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం జరుగుతూ ఉంది. రామ్ పోతినేని కెరియర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ మూవీగా ఈ సినిమా ఉండబోతుంది.శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై శ్రీనివాస చిట్టూరి ఈ సినిమాని నిర్మిస్తున్నారు. తెలుగు హిందీ తమిళ్ కన్నడ మలయాళీ భాషలలో ఈ సినిమాని తెరకెక్కిస్తూ ఉన్నారు. ఇందులో శ్రీలీల రామ్ కి జోడిగా నటిస్తూ ఉంది. ఇదిలా ఉంటే తాజాగా ఈ సినిమాకు సంబంధించి రిలీజ్ డేట్ అనౌన్స్మెంట్ పోస్టర్ ని ప్రేక్షకులు ముందుకి తీసుకొచ్చారు.అక్టోబర్ 20న ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ కాబోతున్నట్లుగా పోస్టర్ లో కన్ఫర్మ్ చేశారు. ఇక బోయపాటి శ్రీను స్టైల్ లోనే పవర్ ఫుల్ మాస్ యాక్షన్ చిత్రంగా ఈ మూవీ ఉండబోతుందని పోస్టర్ బట్టి అర్థమవుతుంది. పోస్టర్ లో కళ్ళజోడు పెట్టుకుని గడ్డంతో ఉన్న రామ్ దున్నపోతుని పట్టుకొని ఈడ్చుకుంటూ వెళ్లడం కనిపిస్తోంది. బ్యాక్ డ్రాప్ లో ఒక ఫెస్టివల్ జరుగుతున్న అపీరియన్స్ ఉంది.దీన్నిబట్టి మూవీ హై వోల్టేజ్ యాక్షన్ ఎలిమెంట్స్ తోనే ఉండబోతుంది అని తెలుస్తుంది. గత ఏడాది ది వారియర్ మూవీతో డిజాస్టర్ కొట్టిన రామ్ ఈ సినిమాతో ఎలా అయినా బ్లాక్ బస్టర్ హిట్ అందుకోవాలని ప్రయత్నం చేస్తూ ఉన్నారు. మరి దానికి తగ్గట్లుగా పాన్ ఇండియా రేంజ్ లో తనని తాను గ్రాండ్ గా ఈ మూవీతో రామ్ పోతినేని ఏ మేరకు ఎస్టాబ్లిష్ చేసుకుంటారు అనేది చూడాలి.

# సెలబ్రిటీ జోడీ విడాకుల పుకార్లకు చెక్ పడ్డట్లేనా?

ప్రేమించి పెళ్లి చేసుకున్న బ్యాడ్మింటన్ స్టార్ గుత్తా జ్వాల.. కోలీవుడ్ స్టార్ విష్ణు విశాల్ విడాకులు తీసుకోబోతున్నారు.. ఇద్దరు విడిగా ఉంటున్నారనే ప్రచారం జరిగింది. తమిళ మీడియాలో వస్తున్న పుకార్లకు బలం చేకూర్చే విధంగా విష్ణు విశాల్ ఇటీవల సోషల్ మీడియాలో షేర్ చేసిన ఒక పోస్ట్ ఉండటంతో వీరిద్దరి విడాకుల గురించి మరింతగా చర్చ జరిగింది.కొన్ని రోజుల క్రితం సోషల్ మీడియాలో విష్ణు విశాల్... నేను చాలా ప్రయత్నించాను



ప్రతి సారి విఫలం అయ్యాను.. మరేం పర్లేదు నేను దాన్ని గుణపాఠంగా తీసుకుంటాను. అది పరాజయం అని నేను అనుకోవడం లేదు నా తప్పుగా భావిస్తున్నాను.. మోసపూరిత ద్రోహంగానే భావిస్తున్నాను అన్నట్లుగా పోస్ట్ చేయడంతో చాలా మంది చాలా రకాలుగా మాట్లాడుకున్నారు.విష్ణు విశాల్ సోషల్ మీడియాలో షేర్ చేసిన పోస్ట్ తో గుత్తా జ్వాల తో విభేదాలు కన్ఫర్మ్.. ఇద్దరు విడిపోవడం కూడా కన్ఫర్మ్ అన్నట్లుగా ప్రచారం జరిగింది. కానీ తాజాగా విష్ణు విశాల్ తమ గురించి వస్తున్న పుకార్లకు స్పందించాడు. మీడియాలో వస్తున్న వార్తలు నిజం కాదని.. తన పోస్ట్ కు వ్యక్తిగత జీవితానికి సంబంధం లేదని వివరణ ఇచ్చాడు.నేను చేసిన ట్వీట్ ను కొందరు తప్పుగా అర్థం చేసుకుని అతి దారుణంగా ఊహించుకున్నారు. ఆ ట్వీట్ లో నేను నా పర్సనల్ లైఫ్ గురించి మాట్లాడలేదు. వ్యక్తిగత విషయాల గురించి కాకుండా వృత్తిపరమైన విషయాలను చెప్పాను. నేను చేస్తున్న ప్రయత్నాలు విఫలం అవుతున్నా కూడా గుణపాఠం నేర్చుకుని కొత్త ప్రాజెక్ట్ చేయాలని భావిస్తున్నట్లుగా పేర్కొన్నాడు.విష్ణు విశాల్ క్లారిటీ ఇచ్చినా కూడా కొందరు మాత్రం సమ్ థింగ్ ఈజ్ ఫిషింగ్ భయ్యా అంటూ కామెంట్స్ చేస్తున్నారు. ఈయన కొత్త పోస్ట్ తో గత కొన్ని రోజులుగా వస్తున్న పుకార్లకు ఫుల్ స్టాప్ పడ్డట్లే అనే అభిప్రాయం ను కొందరు వ్యక్తం చేస్తున్నారు. చక్కగా కలిసి ఉన్న వారి గురించి పాపం విడాకులు అంటూ ప్రచారం జరగడం దారుణం అంటూ అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

# కోహ్లీకి ముచ్చెమటలు పట్టించాడు.. ఇప్పుడు రాజస్తాన్ జట్టులో చోటు కొట్టేశాడు!



ఐపీఎల్-16 సీజన్కు రాజస్తాన్ రాయల్స్ స్టార్ పేసర్ ప్రసిద్ధ్ కృష్ణ గాయం కారణంగా దూరమైన సంగతి తెలిసిందే. దీంతో ప్రసిద్ధ్ కృష్ణ స్థానాన్ని టీమిండియా పేసర్ సందీప్ శర్మతో రాజస్తాన్ భర్తీ చేసింది.ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా రాజస్తాన్ వెల్లడించింది. అతడిని కనీస ధర రూ. 50 లక్షలకు సొంతం చేసుకున్నట్లు రాజస్తాన్ తెలిపింది.కాగా సందీప్ శర్మఐపీఎల్లో అద్భుతమైన ట్రాక్ రికార్డు కలిగి ఉన్నాడు. ఐపీఎల్ పవర్ ప్లేల్లో అత్యధిక వికెట్లు (92 ఇన్నింగ్స్ల్లో 53 వికెట్లు) తీసిన రికార్డు ఇప్పటికీ సందీప్ పేరిటే ఉంది. ఐపీఎల్లో ఇప్పటి వరకు 108 మ్యాచ్లు ఆడిన సందీప్ 114 వికెట్లు పడగొట్టాడు. 2018 నుంచి నాలుగు సీజన్ల పాటు సన్రైజర్స్ హైదరాబాద్కు సందీప్ ప్రాతినిథ్యం వహించాడు. ఐపీఎల్-2022 మెగా వేలంకు ముందు ఎస్ఆర్హెచ్ అతడిని విడిచిపెట్టింది.ఈ క్రమంలో వేలంలోకి వచ్చిన అతడిని పంజాబ్ కింగ్స్ కొనుగోలు చేసింది. ఆ సీజన్లో 5 మ్యాచ్లు ఆడిన సందీప్ కేవలం 2 వికెట్లు మాత్రమే పడగొట్టాడు. దీంతో అతడిని ఐపీఎల్-2023 మినీ వేలంకు ముందు పంజాబ్ కూడా అతడిని విడిచిపెట్టింది. అయితే వేలంలోకి వచ్చిన అతడిని కొనుగోలు చేయలేదు. కాగా ప్రసిద్ధ్ కృష్ణ గాయం కావడంతో మరోసారి ఐపీఎల్లో భాగమయ్యే అవకాశం సందీప్ శర్మకు లభించింది.ఇక టీమిండియా స్టార్ ఆటగాడు, ఆర్సీబీ మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లిపై సందీప్ శర్మ అద్భుతమైన రికార్డు కలిగిఉన్నాడు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**